ప్రజాశక్తి

శుక్రవారం 18 నవంబర్ 2022

8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి

అడ్డగోలు నిర్మాణాలు

- గతంలో ప్లాన్‌లు చూడకుండానే జివిఎంసి అనుమతులు
- ఎండాడ క్వారీ సర్వే నెంబర్ 1లో 109 అక్రమ కట్టడాలు
- రుషికొండ - స్వర్ణభారత్ నగర్ సర్వే నెంబరు 17/1, 2, 5లోని ఖాళీ స్థలం, పార్కుల్లో 300 అక్రమ ప్లాట్లు
- కమిషనర్ దృష్టిసారిస్తారా ?

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

ప్రభుత్వ స్థలాలు, కొండలను తవ్వేసి చేపట్టిన అక్రమ నిర్మాణాల వ్యవహారాలు విశాఖ నగరంలోని మధురవాడ జోన్ పరిధిలో కోకొల్లలు. జివిఎంసి అధికారులు గతంలో ప్లాన్‌లు చూడకుండా ఇచ్చిన అనుమతుల కారణంగా అక్రమ కట్టడాలతో కబ్జారాయుళ్లు రూ.కోట్లకు పడగలెత్తారు. ఈ అడ్డగోలు కట్టడాలపై జివిఎంసి నూతన కమిషనర్ పి.రాజాబాబు దృష్టి సారించాలని ఎండాడ, రుషికొండకు చెందిన పలువురు భావిస్తున్నారు. జివిఎంసి నిబంధనలను తుంగలో తొక్కి అక్రమ నిర్మాణాలు చేపట్టిన వారిపై 'స్క్వాడ్' ద్వారా తనిఖీలు చేయించేందుకు జివిఎంసి సిద్ధమవుతున్న తరుణంలో అసెస్‌మెంట్లు వేసినంత మాత్రాన సమస్య పరిష్కారం కాదని, కూకటివేళ్లతో అక్రమ కట్టడాలపై కొరడా ఝుళిపించాల్సిందేనని స్థానికులు కోరుతున్నారు.

అక్రమార్కుల గుప్పెట్లో రూ.వందల కోట్ల స్థలాలు

రుషికొండ-స్వర్ణభారతి నగర్ ప్రభుత్వ లే అవుట్‌నే ఏకంగా ఓ ప్రబుద్ధుడు కబ్జా చేశాడు. రుషికొండ సర్వే నెంబరు 17/1, 2, 5లలో రెండు దఫాలుగా ఆర్థికంగా వెనుకబడిన తరగతులు (ఇడబ్ల్యుఎస్) వారికి సుమారు 400 పట్టాలను ప్రభుత్వం ఇచ్చింది. ఒక్కో లే అవుట్‌కు 60 చదరపు గజాల్లో అనుమతులిచ్చింది. అయితే అక్కడ ఓపెన్ స్థలాలు, ప్రజా ప్రయోజనాలకు కేటాయించిన పార్కు ఎకరన్నర స్థలంలో మరో 300 అక్రమ ప్లాట్లు వేసేశారు. 3 నుంచి 4 అంతస్తుల భవంతులను అక్రమంగా చెన్నా దాసు అనే వ్యక్తి నిర్మించేశాడు. ఇడబ్ల్యుఎస్ లే అవుట్ సర్వే నెంబరు 17/1, 2, 5 ఎల్‌పి నెంబరు 3/2004లోగల పబ్లిక్ పర్పస్, ఓపెన్ స్పేస్, రోడ్లకు నకిలీ పత్రాలను జివిఎంసికి చూపించి ఇలా వాణిజ్య భవనాలను ప్రభుత్వ స్థలంలో

మిగతా 2లో..



స్వర్ణభారత్ నగర్‌లోని ఓ అక్రమ నిర్మాణం

విభాగాల ప్రక్షాళనకు యాక్షన్ ప్లాన్

- అక్రమ భవన నిర్మాణాలపై కొరడా
- మరో 500 మంది పారిశుధ్య సిబ్బంది నియామకం
- జోన్‌కు ఒక మోడల్ 'స్లమ్' అభివృద్ధి
- కంట్రోల్ కమాండ్ సెంటర్‌కు సేవలన్నీ అనుసంధానం
- జివిఎంసి కమిషనర్ రాజాబాబు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

జివిఎంసిలో ప్రధాన విభాగాల ప్రక్షాళనకు రాగల మూడు నెలలకు వివిధ యాప్‌లు, స్క్వాడ్‌లు, మ్యాపింగ్ ద్వారా సరికొత్త యాక్షన్ ప్లాన్ అమలు చేసేందుకు జివిఎంసి కమిషనర్ పి.రాజాబాబు చర్యలు ప్రారంభించారు. ఈ మేరకు తన ఛాంబర్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశంలో 2023 - 24లో పరిశుభ్ర నగరాల్లో ఒకటి, రెండు స్థానాల్లో నగరాన్ని నిలిపే కృషిచేసానన్నారు. జివిఎంసిలో కార్యకలాపాలన్నిటిపైనా నిఘా, పర్యవేక్షణ కోసం ప్రత్యేక స్క్వాడ్‌ను నియమించి క్షేత్రస్థాయిలో పరిశీలించనున్నట్లు వెల్లడించారు. నగరంలో అక్రమ భవన నిర్మాణాలపై ఆయన స్పందిస్తూ.. ప్రారంభ దశలోనే చర్యలు తీసుకునేలా జివిఎంసి ద్వారా సిబ్బందిని ఏర్పాటు చేస్తానని, ఒకవేళ భవనం సగం వరకూ పూర్తయి తొలగించడానికి వీల్లేకపోతే అసెస్‌మెంట్ సరిగ్గా జివిఎంసికి వచ్చేలా యాక్షన్ ప్లాన్ తయారు చేస్తానని అన్నారు. శానిటేషన్ విషయంలో సంబంధిత సెక్రటరీకే బాధ్యతలు అప్పగించామన్నారు. త్వరలో 500 మంది శానిటేషన్ సిబ్బందిని నియమించుకునేందుకు జిల్లా కలెక్టర్ ఆమోదం తెలిపారన్నారు. ఇప్పుడున్న సుమారు ఐదు వేల మందికి తోడు సిబ్బంది పెరిగితే పారిశుధ్య నిర్వహణ సులభతరం అవుతుందన్నారు. ఐదు వేల మందిలో 80 మందిని ఎంపిక చేసి పారిశుధ్యం, టౌన్ ప్లానింగ్ సమస్యలపై అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. ఫిర్యాదుల కోసం జివిఎంసి టోల్ ఫ్రీ నెంబరు సిద్ధం చేస్తున్నామన్నారు. నగర పరిధిలోగల ప్రతి జోన్‌కూ ఒక మోడల్ స్లమ్ సెలక్టు చేసి అభివృద్ధి చేసే కృషి చేస్తామన్నారు. 300 క్లాప్ వెహికల్స్ ఉన్నాయని, వీటన్నింటినీ మ్యాపింగ్ చేసి కమాండ్ కంట్రోల్ వింగ్‌కి అనుసంధానం చేయనున్నామన్నారు. ఏ వెహికల్, వర్కర్ ఏ రూట్‌లో ఉన్నారో వీటి ద్వారా తెలుసుకుని అవసరమైన చోటకు

మిగతా 2లో..



మాట్లాడుతున్న కమిషనర్ రాజాబాబు

నేవీ నిర్వాసితుల సమస్యలను పరిష్కరించాలి

▶ వార్త మెయిన్‌లో..

సందడిగా.. గిరిజన సంబరాలు

▶ వార్త 8లో..

గరికపాటి వ్యాఖ్యలపై మహిళా సంఘాల నిరసన

▶ వార్త మెయిన్‌లో..

పర్యాటక ప్రాంతాల ప్రవేశ రుసుము పెంపు

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ : వియంఆర్‌డిఎ పరిధిలో ఉన్న కురుసుర సబ్‌మెరైన్ మ్యూజియం, కైలాసగిరి హిల్ పార్క్, హెల్త్ ఎరీనాల ప్రవేశ రుసుము, హెల్త్ ఎరీనా వాకర్స్ చందా రుసుము, తెన్నేటి పార్క్‌లో కార్ పార్కింగ్ రుసుములను పెంచుతున్నట్టు వియంఆర్‌డిఎ కమిషనర్ ఎ.మల్లికార్జున గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం కురుసుర సబ్‌మెరైన్ మ్యూజియం ప్రవేశ రుసుము పెద్దలకు రూ.40, పిల్లలకు రూ.20, స్కూల్ పిల్లలకు (గ్రూపు) రూ.10 ఉండగా కొత్త ప్రవేశ రుసుముగా పెద్దలకు రూ.70, పిల్లలకు రూ.40, స్కూల్ పిల్లలకు (గ్రూపు) రూ.20 వసూలు చేయనున్నారు. కైలాసగిరి హిల్ పార్కు ప్రస్తుత ప్రవేశ రుసుము పెద్దలకు రూ.5 ఉండగా రూ.10గా మారింది. హెల్త్ ఎరీనాకు ఇప్పటివరకు ఎటువంటి రుసుమూ విధించలేదు. తాజాగా పెద్దలకు రూ.10ని ప్రవేశ రుసుముగా వసూలు చేయనున్నారు. హెల్త్ ఎరీనా డైలీ వాకర్స్ నెలసరి చందా రూ.50, సంవత్సర చందా రూ.500 చెల్లించాల్సి ఉంటుంది. తెన్నేటి పార్కు వద్ద ఒక కారు మూడు గంటల పార్కింగ్‌నకు రూ:10 వసూలు చేయనున్నారు. టియు - 142 మ్యూజియంలో వీడియో కెమెరా అనుమతి కోసం టికెట్ ధరను రూ.200గా నిర్ధారించారు. ఈ ధరలన్నీ డిసెంబర్ 1 నుంచి అమల్లోకి రానున్నాయి.



కురుసుర సబ్‌మెరైన్ మ్యూజియం

'ఉక్కు' పరిరక్షణకు 22న భారీ నిరసన దీక్ష

కార్యాచరణ ప్రకటించిన జెఎసి నాయకులు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రయివేటీకరణ ఆపాలని కోరుతూ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద జరుగుతున్న రిలే నిరసన దీక్షలు ఈ నెల 22కు 600 రోజులకు చేరుతున్న సందర్భంగా ఆ రోజున మోడీ ప్రభుత్వానికి పెద్దఎత్తున నిరసన తెలియజేయాలని విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి పిలుపునిచ్చింది. గురువారం జగదాంబ దరి సిఐటియు కార్యాలయంలో జెఎసి సమావేశం జరిగింది. సమావేశానికి జెఎసి ఛైర్మన్ ఎం.జగ్గునాయుడు అధ్యక్షత వహించి మాట్లాడారు. ఈ నెల 11, 12 తేదీల్లో ప్రధాని నరేంద్ర మోడీ విశాఖలో పర్యటించారని, ఈ సందర్భంగా స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ ఆపుతామని ప్రకటన చేస్తారని అంతా భావించామని అన్నారు. కానీ విశాఖ, ఆంధ్ర రాష్ట్ర ప్రజలకు మోడీ తీవ్ర నిరాశను మిగిల్చారని ఆవేదన వెలిబుచ్చారు. స్టీల్‌ప్లాంట్, విభజన చట్టం హామీలు అమలుపై ఏ విధమైన ప్రకటనా చేయకపోవడం అన్యాయమన్నారు. మోడీ రాక సందర్భంగా వందలాది మంది కార్యకర్తలను, నాయకులను గృహ నిర్బంధం, ముందస్తు అరెస్టులు చేయడాన్ని జెఎసిగా ఖండిస్తున్నామన్నారు. మోడీ స్టీల్‌ప్లాంట్‌పై మాట్లాడకపోవడంపై ఈ నెల 22న జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద పెద్ద ఎత్తున నిరసన తెలపాలని పిలుపునిచ్చారు. మోడీ విశాఖ పర్యటన అనంతరం తెలంగాణాలో సింగరేణి గనులను ప్రయివేటుపరం చేయబోమని ప్రకటించడం చూస్తే, ఇది పూర్తిగా రాజకీయ దురుద్దేశంతోనే జరిగిందన్నారు. మన రాష్ట్ర ప్రభుత్వం మోడీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేయడంలో పూర్తిగా విఫలమైందన్నారు. ప్రజలు, కార్మికులు స్టీల్‌ప్లాంట్‌ను

మిగతా 2లో..



అభివాదం చేస్తున్న జెఎసి ఛైర్మన్ జగ్గునాయుడు, నాయకులు

మొదటి పేజీ తరువాయి..

అడ్డగోలు నిర్మాణాలు

కట్టేశారు. ఇది ఎలా జరిగిందంటే?.. ప్రభుత్వం ఇచ్చిన 400 పట్టాల నెంబర్లనే ఆక్రమించిన ఈ స్థలాలకు చెన్నాదాస్ చూపించడం, జివిఎంసి అధికారులు అనుమతులివ్వడం చకచకా జరిగిపోయాయి. ఈ డాక్యుమెంట్లను జివిఎంసి తనిఖీ చేయకుండా గుడ్డిగా వ్యవహరించడంతో రూ.కోట్ల విలువైన ప్రభుత్వ స్థలాలు కబ్జాకోర్ల చేతుల్లోనే ఉండిపోయాయి. ఇక్కడ నిర్మించిన అక్రమ కట్టడాలపై జివిఎంసి చర్యలు తీసుకోవాలన్న డిమాండ్ నేడు సర్వత్రా వినిపిస్తోంది.

ఎండాడ సర్వే నెంబరు1లో భూ దందాలు

ఎండాడ సర్వే నెంబరు 1 క్వారీ కొండపై భూ రాబందుల ముఠా చేరి ప్రజా ఆస్తులను కొల్లగొట్టింది. గతంలో ఈ కొండపై క్వారీని ప్రభుత్వం ఆపేయగా స్థానికులు కొంతమంది చేరి 200 ప్లాట్లను 15 వరుసల్లో లే అవుట్‌లు వేసి అక్రమంగా అమ్మేసుకున్నారు. గతంలో జాయింట్ కలెక్టర్ నివాస్‌కు ఫిర్యాదులు వెల్లడంతో స్పందించి కొన్ని నిర్మాణాలను జెసిబితో తొలగించారు. ఆనాడు తెలుగుదేశం అధికారంలో ఉండడంతో మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు దీనికి అడ్డుతగిలి తొలగించవద్దని హుకుం జారీచేశారు. ప్రస్తుతం 6 లైన్లు, 109 ప్లాట్లు ఉన్నాయి. వీటికి దుర్గానగర్ అని పేరుపెట్టి అక్రమంగా రోడ్ల నిర్మాణాలు చేసి, అమృతపథకంలో పైపులు కూడా జివిఎంసి వేయించింది. పై 109 ప్లాట్లలో 9 ఖాళీగా ఉండగా 35కు గతంలో పట్టాలు రప్పించారు. 75కు పట్టాల్లేవు. కేవలం రేకుల షెడ్లు వేశారు. ఈ వ్యవహారం కోర్టులో ఉంది. జివిఎంసి సరైన రీతిలో వ్యవహరించకుండా అక్రమార్కులపై మెతకగా ఉండడంతో విషయం ముదిరింది. పరిష్కరించాల్సిన బాధ్యత జివిఎంసిదే.

విభాగాల ప్రక్షాళనకు యాక్షన్ ప్లాన్

పంపొచ్చన్నారు. దోమల నియంత్రణకు స్థానిక కార్పొరేటర్‌కు ఫాగింగ్ జరుగుతుందా ? లేదా ? అన్న అంశంపై బాధ్యతలు అప్పగించామన్నారు.

జివిఎంసి ఆదాయ వనరులను సుమారు రూ.400 కోట్ల వరకూ తీసుకెళ్లే కార్యాచరణ ప్రణాళిక తయారు చేస్తున్నామన్నారు. సిఎఫ్‌ఎంఎస్‌కు నిధులు వెళ్లకుండా జివిఎంసి పరిధిలో ఉండేలా చర్యలు చేపడతానన్నారు. దీనికి సంబంధించి బ్యాంకుల్లో త్వరలో 'కోడ్' ఒకటి తీసుకుంటామన్నారు. జివిఎంసి ద్వారా నిర్వహించే కార్యకలాపాలు, సేవలన్నిటికీ 'మల్టీ యుటిలిటీ యాప్' తయారు చేస్తామన్నారు. నగరంలో 8 వేల మ్యాన్‌హోల్స్ ఉన్నాయని, వీటిలో సమస్యాత్మకంగా ఉన్న 600ను సరిచేస్తున్నామని తెలిపారు. జివిఎంసిలో రూ.200 కోట్లతో రోడ్ల పనుల నిర్వహణకు చర్యలు చేపడుతున్నామని, రూ.120 కోట్ల పనులు ఇప్పటికే ప్రారంభించామని వెల్లడించారు. మరో 3 నెలల్లో రోడ్ల మరమ్మతులన్నీ పూర్తవుతాయన్నారు. టిడిఆర్ చెల్లింపుల ఆరోపణలపై స్పందిస్తూ 'గత ఏడాది 25 శాతం రెవెన్యూ గ్రోత్ ఉంది. ఈ ఏడాది 60 శాతం గ్రోత్‌రేట్ పెరిగింది. అన్ని ఏరియాల్లో రెవెన్యూ కోసం కృషి చేస్తున్నాం' అన్నారు. సిఎస్‌ఆర్ నిధుల లెక్కలు తీస్తున్నామన్నారు. స్మార్ట్ సిటీ పనుల కోసం తాజాగా రూ.49 కోట్లు విడుదలయ్యాయన్నారు. తాగునీటిపై సమ్మర్ యాక్షన్ ప్లాన్ సిద్ధం చేస్తున్నామన్నారు. బ్యాంకర్లు రుణాలకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. ఈ నెలాఖరుకు ఎంవిపిలోని ఇండోర్ స్టేడియాన్ని ప్రజలకు అంకితం చేస్తామన్నారు.

'ఉక్కు' పరిరక్షణకు 22న భారీ నిరసన దీక్ష

కాపాడుకోవడానికి పెద్ద ఎత్తున మరో ఉద్యమానికి శ్రీకారం చుట్టాలని కోరారు. కార్యక్రమంలో జెఎసి వైస్ ఛైర్మన్లు పడాల రమణ, భోగవిల్లి నాగభూషణం, కన్వీనర్లు వై.మస్తానప్ప, వై.కొండయ్యతోపాటు జెఎసి నాయకులు ఎంఎస్.కృష్ణ, పి.వెంకటలక్ష్మి, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్, ఎఐటియుసి డిప్యూటీ జనరల్ సెక్రటరీ ఎం.మన్మధరావు, ఐద్వా విశాఖ జిల్లా అధ్యక్షురాలు బి.పద్మ, రైతు సంఘం నాయకులు జి.నాయినబాబు, ఐఎన్‌టియుసి కార్యదర్శి కె.ఈశ్వరరావు, వైఎస్‌ఆర్‌టియుసి నాయకులు ఎస్.చంద్రశేఖర్, మోటారు ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి జి.అప్పలరాజు పాల్గొన్నారు.

'విశ్వకర్మ'ను సందర్శించిన ఎపిపిపిఎ అధికారులు

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ : 48వ అడ్వాన్స్‌డ్ ప్రొఫెషనల్ ప్రోగ్రామ్ ఇన్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ (ఎపిపిపిఎ) అధికారులు ఐఎన్ఎస్ విశ్వకర్మను సందర్శించారు. నేవల్ ఆర్కిటెక్చర్ విభాగంలోని హల్ మెయింటెనెన్స్‌ను, శిక్షణ తీరును తెలుసుకున్నారు. డ్యామేజ్ కంట్రోల్ ట్రైనింగ్ ఫెసిలిటీలో ప్రత్యక్ష ప్రదర్శనను వీక్షించారు. వృత్తిపరమైన అనుభవాలను పంచుకున్నారు.

హెచ్‌పిసిఎల్ ఆస్తి పన్ను బకాయి చెల్లింపు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : హెచ్‌పిసిఎల్ సంస్థ చెల్లించవలసిన ఆస్తి పన్ను బకాయికి సంబంధించి రూ.కోటి చెక్కును అందజేసినట్లు జివిఎంసి కమిషనర్ పి.రాజా బాబు వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ, ప్రైవేటు రంగ సంస్థలు ఆస్తి పన్నుల బకాయిలను జివిఎంసికి చెల్లించి నగరాభివృద్ధికి సహకరించాలని కోరారు.

క్రిస్టియన్ మిషనరీ భూములకు రక్షణ కల్పించాలి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : రాష్ట్రంలో వైసిపి పాలన వచ్చాక కాకినాడ నుండి శ్రీకాకుళం వరకు సుమారు రూ.2 లక్షల కోట్ల విలువ చేసే క్రిస్టియన్ మిషనరీ భూములకు రక్షణ లేకుండా పోయిందని టిడిపి క్రిస్టియన్ విభాగం విశాఖ పార్లమెంట్ నియోజకవర్గం అధ్యక్షుడు ఉరుకూటి డేవిడ్ ఆరోపించారు. గురువారం టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ క్రిస్టియన్ మిషనరీల భూముల రక్షణకు చర్యలు చేపట్టాలన్నారు.

ముగిసిన సీ విజిల్ విన్యాసాలు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : సముద్రంలో యుద్ధ సమయంలోనూ, దేశంలోని తీరప్రాంతంలో ఆకస్మిక పరిస్థితులను ఎదుర్కొనే సమయంలోనూ చేపట్టాల్సిన చర్యలపై తలపెట్టిన కోస్టల్ డిఫెన్స్ ఎక్సర్‌సైజ్ సీ విజిల్ - 22 బుధవారం రాత్రితో ముగిసింది. కోస్తా తీర భద్రతలో పాలుపంచుకున్న తొమ్మిది తీర రాష్ట్రాలు, నాలుగు కేంద్రపాలిత ప్రాంతాల నుంచి 17 ప్రభుత్వ ఏజెన్సీలు ఈ విన్యాసాల్లో పాల్గొన్నాయి. ఇండియన్ నేవీ, కోస్ట్ గార్డ్, స్టేట్స్ మెరైన్, కోస్టల్ పోలీస్, కస్టమ్స్ విభాగాలు భాగస్వాములయ్యాయి.

వివేక్ ఎక్స్‌ప్రెస్ సేవలు పెంపు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ప్రయాణికుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని 15906/15905 దిబ్రుఘర్ - కన్యాకుమారి - దిబ్రుఘర్ వివేక్ ఎక్స్‌ప్రెస్ ఫ్రీక్వెన్సీని వీక్లీ నుంచి బై వీక్లీకి పెంచాలని రైల్వే అధికారులు నిర్ణయించారు. 15906 దిబ్రుఘర్ - కన్యాకుమారి వివేక్ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 22 నుంచి ప్రతి మంగళ, శనివారాలలో దిబ్రుఘర్ నుంచి బయలుదేరుతుంది. అదేవిధంగా 15905 కన్యాకుమారి - దిబ్రుఘర్ వివేక్ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 27 నుంచి ప్రతి ఆది, గురువారాల్లో కన్యాకుమారి నుంచి బయలుదేరుతుంది. ప్రయాణికులు ఈ సౌకర్యాన్ని వినియోగించుకోవాలని రైల్వే శాఖాధికారి త్రిపాఠి కోరారు.

23న అనంత పద్మనాభుని దీపోత్సవం

ప్రజాశక్తి- పద్మనాభం : మండల కేంద్రమైన పద్మనాభంలో అనంత పద్మనాభస్వామి దీపోత్సవాన్ని ఈ నెల 23న నిర్వహించనున్నారు. ఈ మేరకు దీపోత్సవ పోస్టర్‌ను గురువారం కుంతీ మాధవస్వామి ఆలయంలో ఎంపిపి కె.రాంబాబు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా దేవస్థానం కీర్తి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో దీపోత్సవ ఏర్పాట్లపై సమీక్షించారు. కొండపైకి వెళ్లే మెట్ల మార్గానికి ఇరువైపులా ఉన్న తుప్పలను తొలగించాలని, కొండపై ఉన్న దేవాలయానికి రంగులు వేయాలని, మెట్ల మార్గంలో సున్నాలు వేసే పనులు శుక్రవారం నుంచే చేపట్టాలని నిర్ణయించారు. దీపోత్సవానికి అన్ని ఏర్పాట్లు పూర్తిచేయాలని నిర్ణయించారు. కార్యక్రమం పద్మావతి, సిఐ సన్యాసినాయుడు, స్థానిక నాయకులు కాళ్ల నగేష్, కె ఎర్రనాయుడు, జి పద్మనాభ స్వామి, టి.పద్మ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పలు గ్రామాల్లో 'టిడిపి మాటామంతి'

ప్రజాశక్తి-పద్మనాభం : మండలంలోని ఏడు పంచాయతీల పరిధిలోని గ్రామాల్లో గురువారం టిడిపి మాటా మంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. మండలంలోని ఐనాడ పంచాయతీ కేంద్రంలో మండల టిడిపి అధ్యక్షుడు కోరాడ రమణ కార్యక్రమాన్ని ప్రారంభించగా, తెలుగు మహిళలకు చెందిన రెండు బృందాలు మండలంలోని ఐనాడ, బి ఆర్ తాళ్లవలస. కోరాడ, చిన్నాపురం, బుడ్డివలస అగ్రహారం, వెంటాపురం, రేవిడి పంచాయతీల్లో పర్యటించారు. ఈసందర్భంగా తెలుగు మహిళా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కురిమిన లీలావతి,సోషల్ మీడియా ప్రతినిధి లక్ష్మీలావణ్య, నియోజకవర్గం ఆర్గనైజర్ కనకరత్నం, విశాఖ పార్లమెంట్ నియోజకవర్గ తెలుగు మహిళ అధ్యక్షురాలు అనంతలక్ష్మి ఆధ్వర్యంలో మహిళలు ఆయా గ్రామాల్లో పర్యటించారు. ఈసందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ విధానాలపై మహిళల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమౌతోందని తెలుగు మహిళలు తెలిపారు. నిత్యావసరాలు, వంటనూనెలు, వంటగ్యాస్, ఇతర పెట్రోవస్తువులు ధరలు విపరీతంగా పెరిగిపోవడం వల్ల జీనవం దుర్భరమౌతోందని పలువురు మహిళలు ఆవేదన వ్యక్తం చేశారన్నారు.

30న మహిళల పిక్నిక్

ప్రజాశక్తి-సీతమ్మధార : వీరుమామ బ్రాండ్, విజన్ వివికె ఆధ్వర్యంలో ఈ నెల 30న శివాజీ పార్కులో నిర్వహించే మహిళా పిక్నిక్ జయప్రదం చేయాలని నగర మేయర్ హరి వెంకటకుమారికోరారు. గురువారం దీనికి సంబంధించి పోస్టర్‌ను ఆవిష్కరించారు. పిక్నిక్ నిర్వాహకులు వీరుమామను అభినందించారు.

అప్పన్నను దర్శించుకున్న ఎమ్మెల్సీలు

ప్రజాశక్తి-సింహాచలం: సింహాద్రి అప్పన్నను ఎమ్మెల్సీలు వంశీకృష్ణయాదవ్ దంపతులు, మాధవ్ దంపతులు వేరువేరుగా దర్శించుకున్నారు. వీరికి ఎఇఒ ఎన్.ఆనంద్‌కుమార్ ఆలయ సాంప్రదాయ ప్రకారం సాదరంగా స్వాగతం పలికారు.

ముగిసిన బాలల దినోత్సవం

ప్రజాశక్తి- మధురవాడ : విశాఖ మోడల్ అంధుల పాఠశాలలో బాలల దినోత్సవ వేడుకలు ముగిసాయి. ఈ సందర్భంగా న్యాయకళాశాల సమీపంలోని పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో మధురవాడ పరిసర ప్రాంతాలలోని 20 పాఠశాలకు చెందిన దాదాపు 3 వేలకు పైగా విద్యార్థులు, ఉపాధ్యాయులు సందర్శించారు. ప్రదర్శనలో అంధ విద్యార్థులు ఉపయోగించే వస్తువుల్ని, పరికరాలను చూసి సంతోషం వ్యక్తం చేసారు. కార్యక్రమంలోపెందుర్తి ఎంఇఒ పైడపనాయుడు, హెచ్ఎం సుధారాణి, కరస్పాండెంట్ రత్నరాజు పాల్గొన్నారు.

పరిపాలనా విధానంపై ప్రజలతో ముఖాముఖి



దాకమర్రి న్యూఢిల్లీ బృందంతో ఎంపిపి, ఇతర అధికారులు

ప్రజాశక్తి -భీమునిపట్నం : ప్రజలకు పాలన చేరువ చేసే విధానంపై మండలంలోని టి నగరపాలెం, దాకమర్రి గ్రామాల్లో న్యూఢిల్లీకి చెందిన ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్ జనరల్ బిఎస్ఎన్ త్రిపాఠి, కోర్సు డైరెక్టర్ ప్రొఫెసర్ విఎన్ అలోక్, అడిషనల్ కోర్సు డైరెక్టర్ డాక్టర్ కుసుమలత నేతృత్వంలో 38 మంది సభ్యుల బృందం గురువారం పర్యటించింది. ఆయా గ్రామాల సచివాలయాల వద్ద ప్రజలతో పలు అంశాలపై ముఖాముఖి నిర్వహించారు. ప్రజలకు పరిపాలన చేరువపై ప్రతికూల, సానుకూల పరిణామాలను నేరుగా ప్రజలను తెలుసుకున్నారు. డిఆర్‌డిఎ, ఎన్ఆర్ఇజిఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమాన్ని ఆర్‌డిఒ ఎన్.భాస్కరరెడ్డి సమన్వయం చేయగా, ఎంపిపి దంతులూరి వెంకట శివసూర్యనారాయణ రాజు, సర్పంచ్‌లు పొట్నూరు ఛాయాగౌతమి, చెల్లూరి పైడప్పడు, ఎంపిటిసిలు పల్లా నీలిమ, నగేష్‌బాబు, ఎంపిడిఒ పి.వెంకటరమణ, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఐక్య పోరాటాలతోనే సమస్యల పరిష్కారం



సమావేశంలో పాల్గొన్న ఆర్ఎంపిలు

ప్రజాశక్తి-ఆనందపురం : ఐక్యంగా ఉన్నప్పుడే సమస్యలను పరిష్కరించుకోగలమని సామాజిక గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధక్షుడు జంగం జోషి అన్నారు. గురువారం వెల్లంకి సుబ్బరామిరెడ్డి కల్యాణమండపంలో సంఘం గౌరవ సలహాదారు మమ్ముల తిరుపతిరావు అధ్యక్షతన జరిగిన జోనల్ కమిటీ సమావేశంలో మాట్లాడుతూ, ఆర్ఎంపిల గుర్తింపు కోసం ప్రభుత్వం జారీ చేసిన జిఒ అమలుకు పోరాడుదామన్నారు. యూనియన్ విచ్ఛిన్నానికి చేస్తున్న కుట్రలను భగ్నం చేసి, సమస్యల పరిష్కారానికి సమిష్టిగా ముందుకు సాగుదామన్నారు. ప్రస్తుతమున్న జోనల్ కమిటీలను రద్దుచేసి, ఉత్తరాంధ్రలోని ఆరు జిల్లాల్లో కొత్త కమిటీల ఏర్పాటు బాధ్యతను జోషికి అప్పగిస్తూ సమావేశంలో తీర్మానించారు. కార్యక్రమంలో జోనల్ నాయకులు గోపాలరావు, శ్రీకాంత్, సుగుణేశ్వరి, చిరంజీవి, అల్లాడ త్రినాధ్, యన్ రాజు, కనకరావు, కోటి, నారాయణ రావు, ఆకుల శ్రీను, అన్నపూర్ణ, పాడేరు. బాలశు శంకరం, లోగిస గణేశ్, ఉమాశంకర్, రామక్రిష్ణ,రెడ్డి, కోట్ల పైడిరాజు, ఆనందరావు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన



నిర్వాహకులను అభినందిస్తున్న ఎమ్మెల్యే గణబాబు

ప్రజాశక్తి -ములగాడ: మల్కాపురంలోని ప్రకాష్‌నగర్ జంక్షన్‌లో సామాజిక కార్యకర్తలు టి.లివింగ్‌స్టన్, గ్రేస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత నేత్రవైద్యం, మానసిక సమస్యల కౌన్సిలింగ్ శిబిరానికి మంచి స్పందన వచ్చింది. స్థానిక ఎమ్మెల్యే గణబాబు ప్రారంభించిన శిబిరంలో శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రి వైద్యులు డాక్టర్ దివ్య, మానసిక వైద్యనిపుణులు రామారావు పాల్గొని రోగులను పరీక్షించారు..సెయింట్ ఆన్స్ కళాశాల నర్సింగ్ విద్యార్థినులు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు సహకరించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ జిల్లా ప్రోగ్రాం అధికారి భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

సాహితీ సృజనకు వేదికలుగా గ్రంథాలయాలు

జెడ్‌జిఎస్ చైర్‌పర్సన్ కొండా రమాదేవి



కవులను సత్కరిస్తున్నజెడ్‌జిఎస్ చైర్‌పర్సన్ రమాదేవి

ప్రజాశక్తి-పెందుర్తి : సాహితీ సృజనకు వేదికలుగా గ్రంథాలయాలు నిలుస్తాయని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ కొండా రమాదేవి అన్నారు. గురువారం 55వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా పెందుర్తి శాఖ గ్రంథాలయంలో నిర్వహించిన సాహితీ సమ్మేళనంలో మాట్లాడుతూ, సాహితీ సమ్మేళనంలో నగరంలోని వివిధ ప్రాంతాల కవులు, కళాకారులు పాల్గొనడం హర్షనీయమన్నారు. వైసిపి రాష్ట్ర అధికార ప్రతినిధి కొండ రాజీవ్‌గాంధి, లైబ్రేరియన్ సూర్యకళ, కవులు గరిమెళ్ళ నాగేశ్వరరావు, గుండాన జోగారావు, సిహెచ్ చిన్న సూర్యనారాయణ, కోరాడ నరసింహా రావు, శ్రీనివాసమూర్తి, చొక్కర తాతారావు, కెవిఎస్ నరసింహ, కవయిత్రులు బులుసు సరోజినీదేవి, డాక్టర్ దేవులపల్లి పద్మజ, కార్టూనిస్ట్ జగన్నాథ్, టిఆర్ బాబు, దంతులూరి వర్మలతోపాటు దాసరి సత్యం అభివృద్ధి కమిటీ ఉపాధ్యక్షులు పెతకంశెట్టి భూలోకరావు, హెచ్ఎం పిఎస్ఎన్ మూర్తి పాల్గొన్నారు.

జిమ్‌సర్‌లో జాతీయ 'ఎపిలిప్సీ డే'

ప్రజాశక్తి- మధురవాడ: గీతం ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చ్ (జిమ్‌సర్) ఆస్పత్రి ఆధ్వర్యంలో గురువారం జాతీయ ఎపిలిప్సీడే నిర్వహించారు. న్యూరాలజీ నిపుణుల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమాన్ని జిమ్‌సర్ ప్రో వైస్‌ఛాన్సలర్ ప్రొఫెసర్ బి.గీతాంజలి ప్రారంభించారు. గీతం న్యూరాలజీ నిపుణుడు డాక్టర్ విజయభాస్కర్ మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా 50 మిలియన్ల జనాభా మూర్ఛ రోగంతో బాధపడుతున్నారని, వారిలో 80 శాతం మంది అభివృద్ధి చెందుతున్న దేశాలలో ఉన్నారన్నారు. మన దేశంలో 10 మిలియన్ల జనాభా మూర్ఛ రోగంతో ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. మూర్ఛ రోగం ఉన్నవారికి పూర్తి వివరాలతో ముద్రించిన ప్రత్యేక కార్డులను అందజేస్తున్నామన్నారు. తద్వారా వారు ఆరుబయట పడిపోతే ఎవరైనా సాయపడే అవకాశం ఉందన్నారు. రోగి కుటుంబ సభ్యులు తీసుకోవలసిన జాగ్రత్తలను తెలియజేస్తున్నామన్నారు. కార్యక్రమంలో జిమ్‌సర్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జ్యోతిపద్మజ, ఆసుపత్రి సూపరెంటెండెంట్ డాక్టర్ రామాజనేయలు, డిపార్ట్‌మెంట్ ఆఫ్ జనరల్ మెడిసిన్ విభాగాధిపతి డాక్టర్ విఠల్, న్యూరాలజీ సీనియర్ డాక్టర్‌లు డాక్టర్ శిల్పా, డాక్టర్ దీప్తి పాల్గొన్నారు. మూర్ఛ రోగులకు ఉచితంగా మందులు కిట్‌లు అందజేసారు.

విద్యార్థులకు నాంది ఫౌండేషన్ వితరణ



స్కూల్ బ్యాగులతో చిప్పాడ విద్యార్థులు

ప్రజాశక్తి - ఆరిలోవ : నాందీ ఫౌండేషన్ సహకారంతో తోటగరువు, ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో 50 మంది బాలికలకు స్కూలు బ్యాగ్‌లు, ట్యాబ్‌లతో కూడిన విద్యాసామగ్రి మేయర్ గొలగాని హరి వెంకట కుమారి అందజేసారు. హెచ్ఎం విశ్వనాథం, వైసిపి సీనియర్ నేత గొలగాని శ్రీనివాస్, పేరెంట్స్ కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భీమునిపట్నం : చిప్పాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు నాంది ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం స్కూల్ బ్యాగులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం రేఖ అప్పారావు, ఫౌండేషన్ ఇనుస్ట్రక్టర్లు రాజేశ్వరి, లక్ష్మి, అహల్య పాల్గొన్నారు

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో యువకుడు దుర్మరణం

ప్రజాశక్తి - ఆరిలోవ : రోడ్డు ప్రమాదంలో యువకుడు దుర్మరణం చెందిన ఘటన బుధవారం రాత్రి సాగరనగర్, సీతకొండ మలుపులో చోటు చేసుకుంది. ఆరిలోవ పోలీసులు తెలిపిన వివరాలివి. అల్లూరి సీతారామరాజు జిల్లా కొత్త పాడేరు ప్రాంతానికి చెందిన పూటి గిరిప్రసాద్‌నాయుడు(22), తన స్నేహితుడు జె.హరీష్‌తో కలిసి బైక్‌పై బుధవారం విశాఖ నగరానికి వచ్చారు. రాత్రి 10.30 సమయంలో సాగరతీరం సీతకొండ మలుపు తిరుగుతుండగా ఎదురుగా వస్తున్న కుక్కను తప్పించబోయి డివైడర్‌ను, విద్యుత్ పోల్‌ను ఢీకొట్టాడు. దీంతో ద్విచక్రవాహనం నడుపుతున్న గిరి ప్రసాద్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ఆసుపత్రికి తీసుకు వెళ్తుండగా మృతి చెందాడు. మృతుని సోదరి ఐశ్వర్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆరిలోవ సిఐ ఇమ్మాన్యుయేల్‌రాజు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

'శ్రీచైతన్య'లో మ్యాథ్స్ క్లబ్ ఏర్పాటు



మ్యాథ్స్ క్లబ్ ప్రారంభోత్సవంలో ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు

ప్రజాశక్తి -పిఎం.పాలెం : మధురవాడ బక్కన్నపాలెం రోడ్డులోని శ్రీ చైతన్య ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో మ్యాథ్స్ క్లబ్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు రూపొందించిన గణిత నమూనాలు అందరిని ఆకట్టుకున్నాయి. విద్యార్థులలో దాగివున్న అంతర్గత నైపుణ్యాలను వెలికితీసేందుకు ఇటువంటి ప్రక్రియలు దోహదపడతాయని పాఠశాల ప్రిన్సిపల్ సందీప్ అన్నారు.ఈ సందర్భంగా. విద్యార్థులకు జట్టు కృత్యాలు, క్విజ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమానికి ఉత్తరాంధ్ర జిల్లాల శ్రీ చైతన్య పాఠశాలల ఎజిఎం సురేష్, రీజనల్ ఇన్‌ఛార్జి అహ్మద్ అలీ, వైస్ ప్రిన్సిపల్ ఉమామహేశ్వరరావు, డీన్ ఢిల్లేశ్వరరావు, సీ బ్యాచ్ ఇన్‌ఛార్జి జగదీష్ పాల్గొన్నారు.

గాజువాకలో..

గాజువాక : గాజువాక చైతన్యనగర్‌లోని శ్రీచైతన్య పాఠశాలలో మాథ్స్ క్లబ్‌ను పాఠశాల హెచ్ఎం అరుణకుమారి ప్రారంభించారు. విద్యార్థులు స్వయంగా రూపొందించిన మ్యాథ్స్ నమూనాలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ, గణిత మేథావి రామానుజన్‌ను స్ఫూర్తిగా తీసుకుని విద్యార్థులు ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జిలు విజయ, మీనాక్షిం,రాధిక, ఎజిఎం సురేష్, ఆర్ఐ రమణ పాల్గొన్నారు.

వెల్లివిరిసిన మత సామరస్యం



అయ్యప్ప భక్తులకు వడ్డిస్తున్న కార్పొరేటర్ బర్కత్ ఆలీ

ప్రజాశక్తి- కంచరపాలెం : మర్రిపాలెంలో అయ్యప్ప భక్తుడు లోక్‌నాథ్ పాత్రో ఆర్థికసాయంతో నిర్వహించిన అన్నసమారాధనలో 53వవార్డు కార్పొరేటర్ బర్కత్ అలీ పాల్గొన్నారు. అయ్యప్ప స్వాములకు స్వయంగా వడ్డించారు. ఈ సందర్భంగా బర్కత్ ఆలీ మాట్లాడుతూ, అయ్యప్పదీక్షాపరులకు సేవ చేయడం, వారి అన్నసమారాధనలో పాల్గొనడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి

ప్రజాశక్తి -కంచరపాలెం: 53వ వార్డు శివనగర్‌లో బోరు నిర్మాణానికి గురువారం వార్డు కార్పొరేటర్ బర్కత్ అలీ శంకుస్థాపన చేశారు .ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం ఇటీవల మంజూరు చేసిన నిధులతో చేపట్టే అభివృద్ధి పనుల్లో భాగంగా వార్డు పరిధిలో తాగునీటి సమస్య పరిష్కారానికి రూ.లక్షతో శివనగర్‌లో బోరు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు కార్యక్రమంలో ఈదుల రామారావు, హనుమంతు పాల్గొన్నారు

19న బాలోత్సవాల ముగింపు వేడుకలు

హాజరుకానున్న అసెంబ్లీ స్పీకర్ తమ్మినేని, శాంతా సిన్హా

ప్రజాశక్తి- సిరిపురం: నగరంలోని సీతమ్మధార ఎస్ఎఫ్ఎస్ స్కూల్ మైదానంలో ఎపి సిఆర్‌పిఎఫ్, రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్, రాంకీ ఫౌండేషన్, జివిఎంసి స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్, ఐసిడిఎస్, సీడ్, చైల్డ్‌లైన్, విద్యాశాఖల సంయుక్త ఆధ్వర్యాన నిర్వహిస్తున్న బాలల వారోత్సవాలు ముగింపు వేడుకలకు ఈ నెల 19న శనివారం ఎపి అసెంబ్లీ స్పీకర్ తమ్మినేని సీతారాం, ఎంవి ఫౌండేషన్ అనుబంధ చైల్డ్‌రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం వ్యవస్థాపక అధ్యక్షురాలు, రామన్ మెగసెసే అవార్డు గ్రహీత ప్రొఫెసర్ శాంతా సిన్హాతోపాటు నగరానికి చెందిన పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొంటారని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్‌పర్సన్ కేసలి అప్పారావు, కమిషన్ సభ్యులు గొండు సీతారాం చెప్పారు. కార్యక్రమంలో నగరంలోని వివిధ పాఠశాలల విద్యార్థులు, బాలల సంరక్షణకు పనిచేస్తున్న స్వచ్ఛందసంస్థల ప్రతినిధులు పాల్గొంటారని తెలిపారు.

19లోగా వాలంటీరు పోస్టులకు దరఖాస్తులు

ప్రజాశక్తి -పద్మనాభం : మండలంలోని నేరెళ్లవలస, రెడ్డిపల్లి పంచాయతీల్లో ఖాళీగా ఉన్న వాలంటీరు పోస్టులకు ఈనెల 19లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఇన్‌ఛార్జి ఎంపిడిఒ ఇ.రాధ తెలిపారు. నేరెళ్లవలసలో ఒకటి, రెడ్డిపల్లిలో మూడు వాలంటీరు పోస్టులు ఖాళీగా ఉన్నాయని, 18-35ఏళ్లలోపున్న వారు అర్హులని, ఈనెల 22న ఇంటర్వ్యూలు, 23న ఎంపికైన వారికి లెటర్లు, 24న నియామక ఉత్తర్వులు జారీ చేస్తామన్నారు.

రోడ్డు భద్రతపై అవగాహన



ప్లకార్డులతో ప్రచారం చేస్తున్న సెయిం్ట్ జోసెఫ్ ఎన్ఎస్ఎస్ విద్యార్థులు

ప్రజాశక్తి- విశాఖపట్నం : సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాల ఎన్ఎస్ఎస్ వాలంటీర్ల ఆధ్వర్యంలో కాన్వెంట్ జంక్షన్ వద్ద రోడ్డు భద్రతపై అవగాహన ప్రచారం నిర్వహించారు. ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ కె. మాణిక్యకుమారి పర్యవేక్షణలో ప్రగతి క్లబ్, యునైటెడ్ వే ఆఫ్ అమెజాన్‌తో కలిసి అంబేద్కర్ విగ్రహం సమీపంలోని ట్రాఫిక్ సిగ్నల్స్ దగ్గర రోడ్డు నిబంధనలతో కూడిన ప్లకార్డులు పట్టుకుని విద్యార్థులు అవగాహన కల్పించారు. సురక్షిత ప్రయాణానికి ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ జె.నిర్మల, కెమిస్ట్రీ విభాగం సీనియర్ ఫ్యాకల్టీ డాక్టర్ పి.మంగవేణి, ప్రగతి క్లబ్ నిర్వాహకులు పూర్ణానంద్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ షైజీ పాల్గొన్నారు.

వినియోగదారుల ప్రయోజనాలకు పెద్దపీట



ఎంఎస్ సబ్‌స్క్రైబ్‌పై అవగాహన కల్పిస్తున్న నవీన్

ప్రజాశక్తి – గాజువాక : డౌన్ పేమెంట్ లేకుండా, నెలసరి వాయిదాలు చెల్లిస్తూ, ఇఎంఐ ద్వారా కారు పొందడంతోపాటు ఒకవేళ ఖాతాదారునికి ఇష్టం లేకపోతే రెండేళ్ల తర్వాతైనా కారును వెనక్కు ఇచ్చే వెసులుబాటును తమ సంస్థ కల్పిస్తోందని గాజువాక వరుణ్ మోటార్సు బ్రాంచ్ మేనేజర్ నవీన్ అన్నారు. ఖాతాదారుల ప్రయోజనాలకు తమ సంస్థ పెద్దపీట వేస్తోందన్నారు. గురువారం మారుతి సుజుకి వాసిలో ఎంఎస్ సబ్‌స్క్రైబ్‌పై అవగాహన సదస్సు మాట్లాడుతూ, కారు వాపసు విధానం ప్రస్తుతం విదేశాల్లో అమల్లో ఉందని, మన దేశంలో వరుణ్ సంస్థ కొత్తగా ప్రవేశపెట్టిందన్నారు. మధ్యతరగతి పరిశ్రమలు నడిపిస్తున్న వారికి జిఎస్‌టిఉండదని, వడ్డీకూడా తక్కువగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఎస్ ఎం ప్రభాకర్, వాసి ప్రతినిధులు వినోద్‌కుమార్, కృష్ణప్రసాద్ పాల్గొన్నారు.

డిసెంబర్ 17న ఎయు పూర్వ విద్యార్థుల వార్షిక సమ్మేళనం



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎయు విసి, తదితరులు

ముఖ్య అతిథిగా ఇన్ఫోసిస్ నారాయణమూర్తి

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : ఆంధ్రవిశ్వవిద్యాలయం పూర్వవిద్యార్థుల వార్షిక సమావేశాన్ని వచ్చేనెల 17న నిర్వహిస్తున్నట్లు విసి ఆచార్య పివిజిడి ప్రసాదరెడ్డి తెలిపారు. వచ్చే ఏడాది ఏప్రిల్ 26 నుంచి ఎయు శతాబ్ది ఉత్సవాల సమారోహణ, 2025 ఏప్రిల్ 26 నుంచి శతాబ్ది వార్షికోత్సవాలు జరుగుతాయన్నారు. గురువారం ఎయు అకడమిక్ సెనేట్ మందిరంలో దీనికి సంబంధించి పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విసి మాట్లాడుతూ, ఎయు పూర్వవిద్యార్థుల సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు, జిఎంఆర్ సంస్థల అధినేత జిఎంఆర్ అధ్యక్షతన వచ్చేనెల 17న జరిగే వార్షిక సమావేశానికి ముఖ్య అతిథిగా ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకులు ఎన్ఆర్ నారాయణమూర్తి, ప్రత్యేక అతిథిగా అవంతి ఫీడ్స్ లిమిటెడ్ సిఎండి ఎ.ఇంద్రకుమార్ హాజరవుతారన్నారు.. ఇన్ఫోసిస్ నారాయణమూర్తి రోజంతా ఎయులోనే పర్యటించి, ఇంక్యుబేషన్ సెంటర్, సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్, ఫార్మసీ విభాగం, అమెరికన్ కార్నర్ వంటివి పరిశీలిస్తారన్నారు. త్వరలో ఇథియోపియాలో ఎయు పూర్వవిద్యార్థుల సంఘం కార్యాలయాన్ని ప్రారంభిస్తామన్నారు. కార్యక్రమంలో పూర్వవిద్యార్థుల సంఘం అధ్యక్షులు ఆచార్య బీల సత్యనారాయణ, ఉపాధ్యక్షులు ఎ.మన్మోహన్, రెక్టార్ ఆచార్య కె.సమత, రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్, జనరల్ సెక్రటరీ ఆచార్య బి. మోహన వెంకట రామ్, సంయుక్త కార్యదర్శి కుమార్‌రాజ, జిఎంఆర్ ప్రతినిధులు రామకృష్ణ, భువన పాల్గొన్నారు.

'రెయిన్‌బో'లో ప్రీ మెచ్యూర్ బేబీలకు ఊపిరి

ప్రజాశక్తి - ఆరిలోవ : నెలలు నిండకుండా అతి తక్కువ బరువుతో జన్మించిన ప్రీమెచ్యూర్ శిశువులను కాపాడడంలో రెయిన్ బో చిన్నపిల్లల ఆసుపత్రులు విజయవంతమయ్యాయని ఆసుపత్రి వైద్యబృందం వెల్లడించింది. గురువారం ఆరిలోవ హెల్త్ సిటి, రెయిన్‌బో ఆసుపత్రిలో వరల్డ్ ప్రీ మెచ్యూర్ బేబీ డే సందర్భంగా వేడుకలు నిర్వహించారు. ఈసందర్భంగా విలేకర్లతో వైద్యబృందం మాట్లాడుతూ, రెయిన్‌బో వైద్యబృందం సాధించిన విజయాలను వెల్లడించారు. ఆరు నెలల వయస్సు, 375 గ్రాముల బరువుతో జన్మించిన బాలికను కాపాడటంలో దక్షిణాసియాలోనే బంజారు హిల్స్, రెయిన్‌బో ఆసుపత్రి రికార్డు నెలకొల్పిందన్నారు. మన రాష్ట్రంలో 430 గ్రాముల బరువుతో 26 వారాల బాలికను కాపాడిన మొదటి పిల్లల ఆసుపత్రిగా రెయిన్‌బో నిలిచిందన్నారు. ఆసుపత్రిలో నిష్ణాతులైన పిల్లల వైద్యులు, నర్సింగ్ సిబ్బంది, అధునాతన వైద్యపరికరాలు, సాంకేతికత అందుబాటులో ఉండడం వల్లే మెరుగైన వైద్యం అందిస్తున్నా మన్నారు. ఈ సందర్భంగా శిశువుల తల్లిదండ్రులకు పిల్లల వైద్యకిట్లను, ధ్రువపత్రాలను అందజేసారు. కార్యక్రమంలో డాక్టర్ అవినాష్, డాక్టర్ రాగ సుధ, డాక్టర్ అశ్వంత్ రెడ్డి, నర్సింగ్ ఇన్‌చార్జ్ ఉష, ఆసుపత్రి ఆపరేషన్ మేనేజర్ మనోజ్ రెడ్డి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రెయిన్‌బో ఆసుపత్రి వైద్యులు

విద్యాభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట : ముత్తంశెట్టి



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి

ప్రజాశక్తి -భీమునిపట్నం : వైసిపి ప్రభుత్వం విద్యారంగ అభివృద్ధికి అగ్ర తాంబూలం వేస్తున్నట్లు స్థానిక ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. గురువారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రెండో విడత నాడు-నేడు నిధులు రూ.కోటి 26లక్షల 56 వేలతో నిర్మించనున్న పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. పనులను నిర్ణీత గడువులో, నాణ్యతతో చేపట్టాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ పి ఉమారాణి అధ్యక్షతన జరిగిన సభలో జెడిసి ఎస్.వెంకటరమణ, కార్పొరేటర్ గంటా అప్పలకొండ, పిఎసిఎస్ అధ్యక్షులు అక్కరమాని రామునాయుడు, జివిఎంసి కో ఆప్షన్ సభ్యులు కొప్పల ప్రభావతి, మాజీ కౌన్సిలర్లు కొప్పల రమేష్, మైలపల్లి అక్కణ రావు, వైసిపి నేతలు ఎం షణ్ముఖరావు పాల్గొన్నారు. అంతకుముందు ఇదే ప్రాంగణంలోని ప్రభుత్వ ఉన్నతపాఠశాలలోనూ రూ.99.44లక్షల నాడునేడు నిధులతో చేపట్టనున్న పనులకు శంకుస్థాపన చేశారు.

ప్రభుత్వ వైఫల్యాలపై ప్రశ్నిస్తే తప్పుడు కేసులు

వైసిపి ప్రభుత్వంపై మాజీ మంత్రులు అయ్యన్నపాత్రుడు , బండారు ధ్వజం

ప్రజాశక్తి- పెందుర్తి : ప్రశ్నిస్తే తప్పుడు కేసులు పెడుతూ బెదిరిస్తున్నారని, ఇటువంటి తాటాకు చప్పుళ్లకు లొంగేది లేదని మాజీ మంత్రులు అయ్యన్నపాత్రుడు, బండారు సత్యనారాయణమూర్తి వైసిపి ప్రభుత్వంపై ధ్వజమెత్తారు. గురువారంపెందుర్తిలో అయ్యన్న మాట్లాడుతూ, ఇప్పటివరకు తనపై 15 తప్పుడు కేసులు పెట్టారని, అయినా ఉత్తరాంధ్రలోని నాయకులు దీనిపై మాట్లాడకపోవడం శోచనీయమని అసహనం వ్యక్తం చేశారు. విజయసాయిరెడ్డి ఉత్తరాంధ్రను దోచేస్తున్నారని, జగన్ పాలనపై ప్రజలు అసంతృప్తితో ఉన్నారన్నారు. మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ ఇటువంటి దుర్మార్గమైన ప్రభుత్వం చరిత్రలోనే లేదన్నారు. క్రిమినల్ మైండ్ ఉన్న వ్యక్తుల చేతిలో రాష్ట్రపాలన ఉండడం దౌర్భాగ్యమన్నారు. దీన్ని నుంచి విముక్తి కల్పించి రాష్ట్ర ప్రయోజనాలు కాపాడాలంటే మళ్లీ టిడిపి అధికారంలోకి రావాల్సిన అవసరం ఉందని, కేడరంతా సమిష్టిగా పనిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద్ సత్యనారాయణ, జివిఎంసి ఫ్లోర్ లీడర్ పల్లా శ్రీనివాసరావు, కార్పొరేటర్లు పాల్గొన్నారు



మాట్లాడుతున్న అయ్యన్నపాత్రుడు

సమస్యలపై జెడ్‌సికి వినతి



వినతిపత్రం ఇస్తున్న సిఐటియు నేత రాంబాబు, తదితరులు

ప్రజాశక్తి -గాజువాక : గాజువాక నియోజకవర్గ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గాజువాక జోనల్ కమిషనర్ సింహాచలానికి సిఐటియు నాయకులు ఎం రాంబాబు, కిరీటం, నివాస నాయకులు తిరునాద్ స్వామి, సిహెచ్ సత్యనారాయణ, ఎల్ బంగారునాయుడు, పాపారావు గురువారం వినతిపత్రం అందజేశారు. వీధిలైట్లు వెలగడం లేదని, పారిశుధ్య సమస్య తీవ్రంగా ఉందని, చెత్త పన్నులు బలవంతంగా వసూలు చేస్తున్నారన్నారు. దీనిపై గతంలోనూ వినతిపత్రం ఇచ్చినా ఎటువంటి చర్యలు లేవన్నారు. దీనిపై జెడ్‌సి స్పందిస్తూ, వెంటనే వీధి దీపాలు వేయిస్తామన్నారు. తెలిపారు. ఈ సమస్యలపై గతంలో వినతి పత్రం అందజేశామని తెలిపారు. వీటి సమస్య పరిష్కారం కాలేదని వారు తెలిపారు. దీనికి స్పందించిన జోనల్ కమిషనర్ త్వరలో వీధిలైట్ సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.

క్రీడా మైదానాల ప్రయివేటీకరణ వద్దు



ఆందోళన చేస్తున్న డివైఎఫ్ఐ నేతలు

ప్రజాశక్తి -కంచరపాలెం: ప్రభుత్వ క్రీడా మైదానాలు, ఇండోర్‌స్టేడియాలు, క్రీడా వికాస కేంద్రాలను ప్రైవేటుకు లీజుకిచ్చే నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని చిట్టిబాబు కాలనీ అధ్యక్షుడు పి.గౌరీష కోరారు.గురువారం డివైఎఫ్ఐ ఆధ్వర్యాన ఆందోళన చేపట్టారు. ఈసందర్భంగా డివైఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు రాజు మాట్లాడుతూ గ్రామాల్లో క్రీడోత్సవాల నిర్వహణకు సన్నాహాలు చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం, మరోపక్క క్రీడా మైదానాలను ప్రైవేటుకు లీజుకు ఇవ్వడంలో ఆంతర్యం అంతు పట్టడం లేదన్నారు. క్రీడలు, క్రీడాకారుల పట్ల ప్రభుత్వం ద్వంద్వవైఖరిని మానుకోవాలని, ఇప్పటికైనా క్రీడా మైదానాల ప్రైవేటీకరణ నిర్ణయాన్ని మానుకుని, క్రీడలను అభివృద్ధి చేయాలని కోరారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ నాయకులు రఘు, ఆనంద్, కోటయ్య,సత్యం, రాజు, సొంసాను, జయరాజ్, రాములమ్మ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న మేయర్, విఎంఆర్‌డిఎ చైర్మన్, కార్పొరేటర్

ప్రజాశక్తి – ఆరిలోవ : 9వ వార్డు కొండవాలు ప్రాంతమైన సంజయ్‌గాంధీ కాలనీలో గడపగడపకూ మన ప్రభుత్వం హామీల్లో భాగంగా రూ .20 లక్షల వ్యయంతో సామాజిక భవనం అదనపు అంతస్తుకు గురువారం నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి, విఎంఆర్‌డిఎ చైర్మన్, వైసిపి తూర్పు సమన్వయకర్త అక్కరమాని విజయనిర్మల వార్డు కార్పొరేటర్ కోరుకొండ స్వాతీదాస్ వార్డు వైసిపి ఇన్‌ఛార్జి ఉమ్మడి దాస్‌తో కలిసి శంకుస్థాపన చేసారు. అనంతరం విశాలాక్షినగర్, రెవెన్యూ కాలనీలో సామాజిక అవసరాల కోసం కేటాయించిన సుమారు 70 సెంట్ల జివియంసి స్థలాన్ని అన్యాక్రాంతం కాకుండా రూ.40 లక్షల వ్యయంతో కమ్యూనిటీ పార్కు నిర్మాణానికి భూమి పూజ చేసారు.ముందుగా రక్షణ గోడ, వాకింగ్ ట్రాక్, బెంచీలు, పిల్లల ఆటవస్తువులు, ప్రధాన ద్వారం నిర్మించనున్నారు.

ట్రాక్టర్ తొట్టి తిరగబడి

బుచ్చయ్యపేట సర్పంచ్ సూరిబాబు మృతి


గ్రామంలో విషాదఛాయలు

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట

మట్టితో ఉన్న ట్రాక్టర్ తొట్టి తిరగబడటంతో బుచ్చయ్యపేట సర్పంచ్ సుంకర సూరిబాబు బుధవారం అర్ధరాత్రి మృతి చెందారు. అజాతశత్రువుగా పేరున్న సూరిబాబు మరణంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. స్థానికులు కన్నీటిపర్యంతమయ్యారు. సర్పంచ్ సూరిబాబు పశువుల షెడ్డు నిర్మాణానికి బుధవారం రాత్రి తన పశువుల పాక వద్ద ట్రాక్టర్తో మట్టిని వేయిస్తుండగా ప్రమాదవశాత్తు ట్రాక్టర్ తొట్టి తిరగబడి ఆయనపై పడింది. ఇది గమనించిన డ్రైవర్ స్థానికుల సహాయంతో మట్టిని తొలగించి సూరిబాబును పైకి తీసి ఆటోలో ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో పోలేపల్లి సమీపంలో ఆయన మృతి చెందారు. కుటుంబీకులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు బుచ్చయ్యపేట ఎస్సై కుమారస్వామి కేసు నమోదు చేశారు.

ప్రజల వైద్య సేవలకు ప్రాధాన్యత

గ్రామ ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలని సూరిబాబు నిత్యం తపించేవారు. గురువారం విశాఖకు చెందిన కార్పొరేట్ ఆసుపత్రి వైద్యులచే గ్రామంలో ఉచిత వైద్య శిబిరానికి ఏర్పాట్లు కూడా చేశారు. ఇంతలోనే ఆయనను మృత్యువు కబళించింది. గ్రామంలో ఎప్పుడు ఎవరికి అనారోగ్యం ఏర్పడినా వారిని తగిన ఆసుపత్రులలో చేర్పించి ఆరోగ్యం మెరుగయ్యే వరకు వారికి అండగా ఉండే సూరిబాబు ఇక లేడన్న వార్తను గ్రామ ప్రజలు జీర్ణించుకోలేకపోతున్నారు. ఈ ప్రాంతంలో అత్యవసర వేళ వైద్య సేవలకు సహకరిస్తుండడం వల్ల సూరిబాబును అందరూ బుచ్చయ్యపేట అంబులెన్స్ అని ఆప్యాయంగా పిలిచేవారు. సూరిబాబు గతంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శిగా ఎన్నో ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేశారు. అనంతరం విశాఖ డెయిరీ పాల సంఘం అధ్యక్షుడిగా పని చేసియన ఆయన ఏడాదిన్నర క్రితం జరిగిన ఎన్నికలలో అధికార వైసిపి గాలికి ఎదురొడ్డి సర్పంచ్గా గెలిచారు. టిడిపి నేతగా పార్టీ బలోపేతానికి కృషి చేశారు.



పాడె మోస్తున్న మాజీ మంత్రి గంటా, మాజీ ఎమ్మెల్యే రాజు

పాడె మోసిన మాజీ మంత్రి గంటా

సూరిబాబు అంతిమయాత్రలో మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు, చోడవరం మాజీ ఎమ్మెల్యే కెఎస్ఎన్ఎస్.రాజు, టిడిపి నియోజకవర్గం ఇన్ఛార్జి బత్తుల తాతయ్య బాబు తదితరులు పాల్గొని పాడె మోశారు. ఒక ముఖ్యమైన కుటుంబీకుడిని కోల్పోయినట్లుగా గంటా తెలిపారు. విశాఖ డెయిరీ వైస్ చైర్మన్ ఆడారి ఆనందకుమార్, డైరెక్టర్ గేదెల సత్యనారాయణ, డెయిరీ సిబ్బంది, సుగర్ ఫ్యాక్టరీ మాజీ చైర్మన్ గూనూరు మల్లు నాయుడు, జెడ్పిటిసి సభ్యులు దొండ రాంబాబు, వైసిపి మండల అధ్యక్షులు నాయుడు, జనసేన నియోజకవర్గ ఇన్ఛార్జి పివిఎస్ఎన్.రాజు, నాయకులు రేవళ్ల రమేష్, పలువురు సర్పంచ్లు, ఎంపిటిసిలు, టిడిపి కార్యకర్తలు, అభిమానులు బుచ్చయ్యపేట తరలివచ్చి సూరిబాబు భౌతికకాయానికి నివాళులర్పించారు.



క్రీడా పోటీలకు ఎంపికైన విద్యార్థులు

అంతర జిల్లాల క్రీడా పోటీలకు విద్యార్థుల ఎంపిక

ప్రజాశక్తి-అచ్యుతాపురం : అంతర జిల్లాల క్రీడా పోటీలకు మండలంలోని హరిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. వాలీబాల్, త్రో బాల్, ఖోఖో, అథ్లెటిక్స్ పోటీలకు 14 మంది విద్యార్థులు ఎంపికైనట్లు పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు తెలిపారు. ఈ సందర్భంగా వ్యాయామ ఉపాధ్యాయులు ధర్మారెడ్డి రాజును సత్కరించారు.



రైతుతో మాట్లాడుతున్న రికవరీ మేనేజర్ తదితరులు

బకాయిలపై స్పెషల్ డ్రైవ్

ప్రజాశక్తి- కశింకోట : మండలంలో నరసింగబిల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార బ్యాంకు పరిధిలో 2000 సంవత్సరానికి ముందు ఉన్న బకాయిలను తక్షణమే చెల్లించాలని సెంట్రల్ బ్యాంక్ సీనియర్ రికవరీ మేనేజర్ ఎమ్.రామకృష్ణ రైతులకు విజ్ఞప్తి చేశారు. మండలంలోని ఏనుగుతుని, మోసయ్యపేట గ్రామాల్లో రైతులతో బుధవారం ఆయన మాట్లాడారు. ఇప్పటి వరకు ఎంతమంది బాకాయదారులు ఉన్నారో కార్యదర్శిని అడిగి తెలుసుకున్నారు. బ్యాంకులో బంగారు రుణాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ గణేష్, సూపర్ వైజర్ శ్రీరామ్మూర్తి, కార్యదర్శి నక్కా అచ్చియ్యనాయడు పాల్గొన్నారు.

19న ఎఐఐఇఎ మహాసభ

ప్రజాశక్తి-చోడవరం : ఆల్ ఇండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయిస్ అసోసియేషన్ విశాఖ డివిజన్ 48వ మహాసభ ఈ నెల 19న అనకాపల్లిలోని కర్రి రమేష్ కళ్యాణ మండపంలో నిర్వహిస్తున్నట్లు యూనియన్ చోడవరం శాఖ అధ్యక్షులు వై.లవరాజు, కె.కళ్యాణ్ కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మహాసభకు యూనియన్ జాతీయ కోశాధికారి బిఎస్.రవి, సౌత్ సెంట్రల్ జోన్ కార్యదర్శి టివిఎన్ఎస్.రవీంద్రనాథ్ హాజరవుతారని, ఎల్ఐసి ఉద్యోగులందరూ మహాసభలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

అనారోగ్యంతో సుగర్స్ కార్మికుడు మృతి

ప్రజాశక్తి-అనకాపల్లి

తనకు రావాల్సిన బకాయి జీతాలు, పిఎఫ్, ఇఎస్ఐ వంటి సౌకర్యాలు కల్పించకపోవడంతో అనారోగ్యానికి గురై తుమ్మపాల సుగర్ ఫ్యాక్టరీ కార్మికుడు బద్ది సూరిబాబు గురువారం మృతి చెందారు. ప్రభుత్వం స్వచ్ఛంద ఉద్యోగ విరమణ ద్వారా ఈ ఏడాది ఏప్రిల్ 30న సూరిబాబును తొలగించింది. అయితే ఆయనకు రావలసిన జీతం బకాయిలు చెల్లించలేదు. పిఎఫ్, ఈఎస్ఐ వంటి సౌకర్యాలు కల్పించలేదు. యాజమాన్యం కనీసం పిఎఫ్ చెల్లించి ఉంటే పింఛనుకు అర్హుడై ఉండేవాడని, బీమా సౌకర్యానికి దూరమవుతున్నామని కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇపిఎఫ్ కమిషనర్ తక్షణమే స్పందించి కార్మిక చట్టాలను ఉల్లంఘిస్తున్న యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని సహకార చక్కర కర్మాగారాల ఉద్యోగ కార్మిక రాష్ట్ర ఫెడరేషన్ ఆర్గనైజింగ్ కార్యదర్శి ఎవి నూకేశ్వరరావు డిమాండ్ చేశారు.

రోడ్డు పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : నగర ప్రజలకు మౌలిక వసతులు కల్పించేందుకు నిరంతరం కృషి చేస్తున్నట్లు మేయర్ గొలగాని హరి వెంకట కుమారి తెలిపారు. గురువారం ఆమె 16వ వార్డు పరిధిలోని కెఆర్ఎం.కాలనీ, రజక వీధిలలో జివిఎంసి నిధులు రూ.54 లక్షలతో తారు రోడ్ల నిర్మాణానికి విఎంఆర్డిఎ ఛైర్పర్సన్ అక్కరమాని విజయనిర్మల, వార్డు కార్పొరేటర్ మొల్లి లక్ష్మితో కలిసి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో జోనల్ కమిషనర్ విజయలక్ష్మి, కార్యనిర్వాహక ఇంజినీర్ శ్రీనివాస్, ఎపిఐఐసి డైరెక్టర్ మొల్లి అప్పారావు, వైసిపి 16వ వార్డు అధ్యక్షులు చొల్లంగి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

'ప్రాణహాని ఉంది.. రక్షించరూ..'


ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : తనకు మంత్రి గుడివాడ అమర్నాథ్, అతని అనుచరుల నుంచి ప్రాణహాని ఉందని తెలుగు శక్తి అధ్యక్షులు బివి.రామ్ ఎంవిపి పోలీస్ స్టేషన్లో గురువారం ఫిర్యాదు చేశారు. ప్రభుత్వ వైఫల్యాలను ఎప్పటికప్పుడు ఎండగడుతున్న తనపై వారు కక్షగట్టారన్నారు. మంగళవారం మధ్యాహ్నం ఒక వ్యక్తి గుడివాడ అమర్నాథ్ సోదరుడినని ఫోన్ చేసి బెదిరించారన్నారు.

పార్కు ఏర్పాటు హామీని నెరవేర్చాలి

ప్రజాశక్తి-కశింకోట : అనకాపల్లి ఎంపీ సత్యవతి ఇచ్చిన మాట ప్రకారం తాళ్లపాలెం చెరువును పార్కుగా అభివృద్ధి చేసే పనులు చేపట్టాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్ఆర్.నాయుడు డిమాండ్ చేశారు. గురువారం ఆయన తాళ్లపాలెం చెరువును పరిశీలించారు.

23న పట్టభద్రుల నియోజకవర్గ ఓటర్ల ముసాయిదా విడుదల

ప్రజాశక్తి-అనకాపల్లి : ఈనెల 23న పట్టభద్రుల నియోజకవర్గ ఓటర్ల ముసాయిదా జాబితాను విడుదల చేయనున్నట్లు జిల్లా రెవెన్యూ అధికారి వెంకటరమణ తెలిపారు. కలెక్టరేట్లో గురువారం వివిధ రాజకీయ పార్టీల నాయకులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో మొత్తం 44 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అనకాపల్లి రెవెన్యూ డివిజన్లో 24, నర్సీపట్నం డివిజన్లో 20 కేంద్రాలు ఉన్నాయని చెప్పారు. వీటిపై సూచనలు, సలహాలు తెలియజేయాలని కోరారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు జుత్త వెంకటరమణ, టిడిపి నాయకులు బొలిశెట్టి శ్రీనివాసరావు, సిపిఎం నాయకులు గంట శ్రీరామ్, ఆమ్ ఆద్మీ పార్టీ నాయకులు కొణతాల హరినాథ్ బాబు, సిపిఐ నాయకులు వైఎన్.భద్రం, బిజెపి నాయకులు ఊడా రమేష్, బీఎస్పీ నాయకులు ఎస్ఎస్వి రామచంద్రరావు పాల్గొన్నారు.



రాజకీయ పార్టీల సమావేశంలో మాట్లాడుతున్న డిఆర్ఓ

వివిధ శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్ష

ప్రజాశక్తి-అనకాపల్లి : స్థానిక కలెక్టరేట్లో కలెక్టర్ రవి పఠాన్ శెట్టి గురువారం వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. వైయస్సార్ చేయూత మహిళా మార్ట్, వి.మాడుగుల హల్వా బ్రాండ్, విస్తరాకుల తయారీ యూనిట్, ఏటికొప్పాక లక్క బొమ్మల తయారీ కేంద్రాల్లో కార్మికుల సమస్యలు, కంచు వస్తువుల తయారీ యూనిట్, సేంద్రియ బెల్లం తయారీ యూనిట్ల విస్తరణ, కోల్డ్ స్టోరేజీ కలెక్షన్ సెంటర్లు ఏర్పాటు, పీఎంఈజీపి, పిఎమ్ఎఫ్ఎమ్ఈ ద్వారా యూనిట్ల ఏర్పాటు, చేయూత ఆసరా లబ్ధిదారుల జీవనోపాధి మెరుగుదలకు చర్యలు, రైతు ఉత్పత్తి కేంద్రాల అభ్యున్నతి తదితర అంశాలపై చర్చించారు. ఈ సమావేశంలో డిఆర్డిఏ పిడి సీతాపతి, జిల్లా వ్యవసాయ అధికారిని లీలావతి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న కలెక్టర్, వివిధ శాఖల అధికారులు



పోటీలను ప్రారంభిస్తున్న ఎంపిపి సూరిబాబు

క్రీడా పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి-అనకాపల్లి : స్థానిక ఎన్టీఆర్ స్టేడియంలో గురువారం జగనన్న క్రీడా సంబరాల్లో భాగంగా వాలీబాల్, క్రికెట్, కబడ్డీ పోటీలను ఎంపిపి గొర్లె సూరిబాబు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిఎం జగన్మోహన్ రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని ఈ క్రీడా సంబరాలు నిర్వహిస్తున్నామని, ఆసక్తిగల క్రీడాకారులు పాల్గొవాలని కోరారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత వ్యాయామ ఉపాధ్యాయులు కెఎన్వి సత్యనారాయణ, వ్యాయామ ఉపాధ్యాయులు పీలా కాశీ తదితరులు పాల్గొన్నారు.

చలో ఢిల్లీని జయప్రదం చేయండి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ

ఇపిఎస్ పెన్షన్దారుల సమస్యల పరిష్కారం కోసం డిసెంబరు 7, 8 తేదీల్లో తలపెట్టిన చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సంఘం నాయకులు పిలుపునిచ్చారు. ఎపిఎస్ ఆర్టిసి రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఏర్పడి 22 ఏళ్ళు అయిన సందర్భంగా అసోసియేషన్ ఆధ్వర్యాన మద్దిలపాలెం ఆర్టిసి కాంప్లెక్స్ వద్ద సంఘం జెండావిష్కరణ చేపట్టారు. కోర్కెల దినం పాటించారు. తొలుత సంఘం సీనియర్ నాయకులు బివి.రమణ జెండాను ఆవిష్కరించగా, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ వి.తులసీరాం, ఇపిఎస్ 95 ఆల్ పెన్షనర్స్ రిటైర్డ్ అసోసియేషన్ నాయకులు కెఎం.కుమార్మంగళం మాట్లాడారు. ఆర్టిసిలో రిటైర్ అయిన 40 వేల మంది ఇపిఎస్ - 95 పెన్షన్ స్కీంలో ఉండిపోవడంతో తీవ్ర ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. పాత పెన్షన్ సౌకర్యం కల్పించాలని ఉద్యమిస్తున్నా నేటికీ ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కనీస పెన్షన్ రూ.9 వేలు ఉండాలని సుప్రీంకోర్టు చెప్పినప్పటికీ దానిని కూడా అమలు చేయడం లేదన్నారు. ప్రభుత్వం ప్రస్తుతం ఇస్తున్న రూ.600 - రూ.2100 పెన్షన్ వైద్య ఖర్చులకు సైతం సరిపోవడం లేదన్నారు. ఆర్టిసిలో ప్రస్తుతం అమలు జరుగుతున్న ఎస్ఆర్బిఎస్, మెడికల్ స్కీం, ఆర్టిసి బస్సుల్లో ఫ్రీట్రావెల్ గుర్తింపు కార్డులను కొనసాగిస్తూ, హైటెక్ బస్సులలో ఉచిత ప్రయాణానికి అనుమతి ఇవ్వాలన్నారు. ప్రభుత్వ పథకాలు వర్తింపజేయాలన్నారు. కార్యక్రమంలో కెపి.కుమార్, వైఎం.రావు, ఎస్ఎన్.రాజు, బి.శంకరరావు, తాజుద్దీన్, మోహన్రాజు, ఎస్బి.బాబు పాల్గొన్నారు.

ఘనంగా అయ్యప్పస్వామి పూజలు

ప్రజాశక్తి-అనకాపల్లి : స్థానిక కన్యకా పరమేశ్వరి అయ్యప్ప ఆలయంలో గురువారం ఎంవిఆర్ గ్రూప్ ఆఫ్ ఇండస్ట్రీస్ అధినేత ముత్యాల వెంకటేశ్వరరావు సూర్య కుమారి దంపతులు, వారి తనయులు రాజేష్, సతీష్ ఆధ్వర్యంలో అయ్యప్ప స్వామి పూజలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

20న ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి-అచ్యుతాపురం : సురక్ష హెల్త్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శ్రీవిష్ణు హాస్పిటల్, కేర్ హాస్పిటల్ వైద్యులతో ఈ నెల 20న ఆదివారం అచ్యుతాపురంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఎ.సుధీర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.



డ్రోన్ సర్వే పనులు ప్రారంభిస్తున్న తహశీల్దారు సత్యనారాయణ

రీ సర్వేతో రైతులకు భూ హక్కులు

ప్రజాశక్తి-సబ్బవరం : మండలంలోని వంగలి పంచాయితీ శివారు తెలుకలి పాలెం గ్రామంలో సమగ్ర భూ రీ సర్వేను గురువారం తహశీల్దార్ బి.సత్యనారాయణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూ రీ సర్వేతో రైతులు భూ హక్కులు పొందవచ్చని చెప్పారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఆకుల శ్రీహేమ, ఆకుల గణేష్, ఎంపిటిసి గవర తులసి రాజు, వైసిపి అధికార ప్రతినిధి యర్రా శ్రీనివాసరావు, సర్వేయర్ కె.శ్రీనివాసరావు, విఆర్వో పివిఎన్ మూర్తి, ఉప సర్పంచ్ గొర్లి అప్పల నాయుడు, జెట్టి ముత్యాల నాయుడు, పొట్నూరు అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

న్యాయమూర్తి విజయ్ చంద్రకు డాక్టరేట్



ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి కోర్టు మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఎస్.విజయచంద్రకు ఆంధ్ర యూనివర్సిటీ డాక్టరేట్‌ను అందజేసింది. చిన్నారులను లైంగిక వేధింపుల నుంచి రక్షణకు సంబంధించిన చట్టాలపై చేసిన పరిశోధనలకు గాను ఆయనకు డాక్టరేట్ ప్రదానం చేసింది. విజయ్ చంద్రకు అనకాపల్లి బార్ అసోసియేషన్ సభ్యులు, న్యాయవాదులు అభినందనలు తెలిపారు.

బాలల హక్కుల పరిరక్షణ అందరి బాధ్యత

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట : బాలల హక్కులను పరిరక్షించేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యత వహించాలని సీడ్స్ సంస్థ కార్యదర్శి సన్యాసిరాజు అన్నారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో గురువారం మండలంలోని సచివాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులకు బాలల హక్కుల వారోత్సవాల సందర్భంగా చైల్డ్ లైన్ సీడ్స్ సంస్థ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. తహశీల్దార్ అంబేద్కర్ మాట్లాడుతూ మాట్లాడుతూ బాలల అభివృద్ధికి అందరూ కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడివో సువర్ణరాజు, అదనపు ఎస్ఐ సింహాచలం నాయుడు, చైల్డ్ లైన్ జిల్లా కో-ఆర్డినేటర్ డేవిడ్ రాజు, కనకమ్మ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన

ప్రజాశక్తి అచ్యుతాపురం : మండలంలోని ఎం.జగన్నాధపురం, ఉ ప్పవరం, నరేంద్రపురం, మల్లవరం గ్రామాలలో చేపట్టిన పలు అభివృద్ధి పనుల తీరును గురువారం ఎంపిపి కోన సంధ్య బుజ్జి పరిశీలించారు. ఉప్పవరం సచివాలయంలో పనిచేసి బదిలీ అయిన విఆర్ఓ గౌరీ, సెక్రటరీ సంతోష్‌ను ఈ సందర్భంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడివో విజయలక్ష్మి, మల్లవరం సర్పంచ్ పిన్నమరాజు వాసు, ఎంపిటిసి రావి నాగలక్ష్మి శోభన్ బాబు, మాజీ సర్పంచ్ చిన్ని శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సాలాపువానిపాలెంలో వైద్య శిబిరం

ప్రజాశక్తి-అనకాపల్లి : జివిఎంసి 84వ వార్డు పరిధి సాలాపువానిపాలెంలో గురువారం సీతారామ సేవా సంఘం ఆధ్వర్యంలో ఆర్కే ఆసుపత్రి సౌజన్యంతో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని వార్డు కార్పొరేటర్ మాదంశెట్టి చిన్న తల్లి నీలబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా నామమాత్రపు రుసుముతో మందులను అందజేశారు. డాక్టర్ టి.నాయుడు బాబు, ఎస్ జయలక్ష్మి, అరుణ శ్రీ, ఆలయ అధ్యక్షులు సాలాపు మోహన్ తదితరులు పాల్గొన్నారు.

తుమ్మపాలలో 104 వైద్య సేవలు

ప్రజాశక్తి-అనకాపల్లి : మండలంలోని తుమ్మపాలలో బుధవారం 104 వాహనం ద్వారా వైద్య సేవలు నిర్వహించారు. బిపి, సుగర్ పరీక్షలతో గర్భిణులకు వైద్యసేవలు అందించి 65 రకాల మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి రాష్ట్ర కార్యదర్శి దంతులూరి దిలీప్ కుమార్, గ్రామ సర్పంచ్ తట్ట పెంటయ్య నాయుడు పిహెచ్‌సి వైద్యులు ససిం, వైస్ ఎంపిపి సూర్యకుమారి చంద్ర శేఖర్, ఎంపిటిసి పంచదార్ల కన్నారావు, పన్నీరు వెంకటలక్ష్మి చంటి, వార్డు మెంబర్లు రవ్వ శ్రీను, మోది నాయుడు, ఎర్రంశెట్టి రామారావు, పడాల గణపతి, ఆర్టీసీ సత్యనారాయణ, ఆశా వర్కర్లు పాల్గొన్నారు

గ్రంథాలయాల్లో బహుముఖ పోటీలు

55వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా గురువారం జిల్లాలోని పలు గ్రంథాలయాల్లో విద్యార్థులకు వ్యాసరచన చిత్రలేఖన పోటీలు నిర్వహించారు.

ప్రజాశక్తి-అనకాపల్లి

స్థానిక బాలాజీరావు పేట జీవిఎంసీ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు శాఖ వీధి గ్రంథాలయ అధికారి కె.శ్రీనివాసరావు, సిద్ధార్థ సోషల్ సర్వీస్ అండ్ కల్చరల్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు బల్ల నాగభూషణం ఆధ్వర్యంలో వ్యాసరచన, చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం హసీనా బేగం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కశింకోట : మండలంలోని తాళ్ళపాలెం శాఖా గ్రంథాలయంలో పాఠశాల విద్యార్థులకు సీనియర్, జూనియర్ విభాగాల్లో వ్యాసరచన, రంగవల్లి (బాలికలకు) పోటీలు నిర్వహించారు. వీటిల్లో 96 మంది విద్యార్థులు పాల్గొన్నారు. గ్రంథాలయ అధికారి కె.జగన్ ఆధ్వర్యాన జరిగిన ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు కె.లోవలక్ష్మి, ఎన్.రాజ్యలక్ష్మి, ఎ.విజయ, వి.కలైసెల్వి, ఎంవికె.హరినాథ్, ఐ.ప్రశాంతి పాల్గొన్నారు.

అచ్యుతాపురం : స్థానిక గ్రంథాలయంలో విద్యార్థులకు గ్రంథాలయ అధికారి దొడ్డి కోటేశ్వరరావు పర్యవేక్షణలో వ్యాచరచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో అచ్యుత, క్రైస్ట్, రవీంద్ర, గాయత్రి తదితర ప్రైవేటు పాఠశాలలు, జిల్లా పరిషత్ హైస్కూల్‌కు చెందిన 130 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

మునగపాక రూరల్ : స్థానిక శాఖ గ్రంథాలయంలో గ్రంథాలయాధికారి ఎల్లి రమణ ఆధ్వర్యంలో గురువారం దేశభక్తి గేయాలు పోటీలు, సీనియర్ విద్యార్థులకు పర్యావరణం కాలుష్య నివారణ అన్న అంశాలపై చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. న్యాయ నిర్ణేతగా ఉపాధ్యాయులు శివకోటి దుర్గాప్రసాద్ వ్యవహరించారు. ఉపాధ్యాయులు వినయ్, గణేష్ వివిధ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

కె.కోటపాడు : స్థానిక శాఖ గ్రంథాలయంలో హైస్కూల్ విద్యార్థులకు డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. వారోత్సవాలలో నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలకు ముగింపు రోజున బహుమతులు ప్రదానం చేయనున్నట్లు గ్రంథాలయాధికారి కె.సౌమ్య తెలిపారు.

సబ్బవరం : స్థానిక శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయాధికారి పి.వి.రమణ ఆధ్వర్యంలో వ్యాసరచన పోటీల్లో విజ్ఞాన, ప్రతిభ, మదర్ పాఠశాలలు, ప్రభుత్వ హైస్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు. ముఖ్య అతిథిగా ఎంఈఓ ఎస్.అప్పలరాజు ముఖ్య అతిథిగా పాల్గొని పరిశీలించారు. బి.సింహాద్రి, సిహెచ్ కుమార్, ప్రసాద్, డివిప్ని కుమారి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

నక్కపల్లి : గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా మండలంలోని చినదొడ్డిగల్లు గ్రంథాలయంలో ఆ శాఖ అధికారి జనార్దన్ ఆధ్వర్యంలో గురువారం విద్యార్థులకు క్రీడా పోటీలు నిర్వహించారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో హెచ్ఎం అప్పారావు, పిడి దేముళ్ళ ఆధ్వర్యంలో వివిధ క్రీడా పోటీలు జరిగాయి. నక్కపల్లి గ్రంథాలయంలో గ్రంథాలయ అధికారి గోవింద ఈశ్వరరావు ఆధ్వర్యంలో గ్రంథాలయోద్యమకారులకు ఘన నివాళులర్పించారు. విద్యార్థులకు కబడ్డీ పోటీలు నిర్వహించారు.

చీడికాడ : స్థానిక గ్రంథాలయంలో విద్యార్థులకు క్విజ్ పోటీలను గ్రంథాలయాధికారిణి ఎంఎస్ఎల్ జోగేశ్వరి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ క్విజ్ పోటీలను హైస్కూల్ ఉపాధ్యాయురాలు మాధవి, ఆకాష్ స్కూల్ కరెస్పాండెంట్ జి.ప్రసాద్ పర్యవేక్షించినట్లు జోగేశ్వరి తెలిపారు.

పాయకరావుపేట : పట్టణంలోని వైయస్సార్ శాఖ గ్రంథాలయంలో క్విజ్ పోటీలను నిర్వహించారు. ఉప సర్పంచ్ జగతా భవాని శ్రీనివాస్, ఇన్చార్జి గ్రంథాలయ అధికారి వామాల లక్ష్మణరావు మాట్లాడుతూ, వివిధ పాఠశాలలకు చెందిన 120మంది విద్యార్థులు క్విజ్ పోటీల్లో పాల్గొన్నారన్నారు.

కోటవురట్ల : గ్రంథాలయ అధికారి అప్పలనాయుడు ఆధ్వర్యంలో పలు అంశాల పట్ల విద్యార్థులకు డిబేట్ నిర్వహించారు. పలు పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ బాలికల పాఠశాల, కేజీబీవీ విద్యార్థులు పాల్గొన్నారు.

రోలుగుంట : గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా గురువారం రోలుగుంట శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయాధికారి ఎస్.వరలక్ష్మీ ఆధ్వర్యంలో చెస్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో రోలుగుంట ఉన్నత పాఠశాల, కేజీబివి, జూనియర్ కళాశాల నుంచి 40 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు బి.రాజ, కెవిబివి నుంచి వి.శ్యామలకుమారి పాల్గొన్నారు.



రోలుగుంటలో చదరంగం పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

కోర్టు వివాదంలో ఉన్న భూముల్లో పంటలు ఎలా వేస్తారు?

ప్రజాశక్తి - దేవరాపల్లి

దేవరాపల్లి రెవెన్యూ సర్వే నెంబరు 20, 280/1, 281/1, 281/2లో కోట్లు విలువ చేసే సుమారుగా 50 ఎకరాల భూమి కోర్టు వివాదంలో ఉండగా, ఆ భూముల్లో పంటలు ఏ విధంగా వేస్తారని సిపిఎం జిల్లా కార్యదర్శి డి.వెంకన్న ప్రశ్నించారు. ఈ భూమికి రక్షణ కల్పించి పంటలు వేయడాన్ని నివారించాలని కోరుతూ ఆయన ఉపముఖ్యమంత్రి బూడి ముత్యాల నాయుడుకు గురువారం బహిరంగ లేఖ రాశారు. ఈ భూమిలో ఉన్న ఫలసాయం తీసుకోవడానికి అనుమతి పొందిన వారు, ఆ తరువాత కోర్టు తుది తీర్పు వచ్చే వరకు మళ్లీ ఆ భూముల్లో ఎటువంటి పంటలు వేయరాదన్నారు. ఈ భూముల్లో పంటలు వేసినా, పంటలు తీసిన వారిపై కేసులు పెట్టి, ఫలసాయాన్ని వేలం వేసి విధంగా చర్యలు తీసుకోవాలని వెంకన్న కోరారు.




మాట్లాడుతున్న రాజేష్, చిత్రంలో వెంకటరావు

అగ్రిగోల్డ్, సిమ్స్ బాధితులకు న్యాయం చేయాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : వేలకోట్ల రూపాయల ప్రజాధనాన్ని లూటీ చేసిన అగ్రిగోల్డ్, సిమ్స్ సంస్థల ఆస్తులను జప్తు చేస్తున్న ప్రభుత్వం బాధితులకు సత్వరమే న్యాయం చేయాలని ఉత్తరాంధ్ర చర్చ వేదిక నాయకులు బుద్ద రాజేష్, బొడ్డేడ వెంకటరావు డిమాండ్ చేశారు. గురువారం వారు స్థానిక విలేకరులతో మాట్లాడుతూ అగ్రిగోల్డ్‌లో రూ.30 వేలు, ఆ పైబడ్డ వారికి చెల్లింపులపై చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై హామీ ఇచ్చిన జగన్మోహన్ రెడ్డి తక్షణమే బాధితులకు న్యాయం చేయాలన్నారు. సిమ్స్ కంపెనీకి చెందిన సుమారు రూ.1500 కోట్ల ఆస్తులను జప్తు చేసినా, నేటికీ ఆయా బాధితులకు ఒక్క రూపాయి చెల్లించలేదని తెలిపారు. సంస్థ ఆస్తులు ప్రభుత్వ ఆధీనంలో ఉన్నాయా, భూకబ్జాదారుల చేతుల్లోకి వెళ్లాయా అనేది స్పష్టం చేయాలని, బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

లెప్రసీ వ్యాధిగ్రస్తునికి రూ.5 వేలు ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న టిడిపి నేత పైలా ప్రసాదరావు

ప్రజాశక్తి- కె.కోటపాడు : లెప్రసీ వ్యాధితో బాధపడుతున్న మండలంలోని లంకవానిపాలెం గ్రామానికి చెందిన కిల్లాడ ముసలినాయుడుకు టిడిపి మాడుగుల నియోజకవర్గం నాయకులు పైలా ప్రసాదరావు గురువారం రూ.5వేలు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు బండారు నరసింహనాయుడు, గ్రామ నాయకులు లెక్కల దేవుడుబాబు, డెక్క శ్రీను, కొరుపోలు సునీత, గాడి అక్కునాయుడు, కొరుపోలు సాంబయ్య, కొరుపోలు తాత తదితరులు పాల్గొన్నారు.

అన్నసమారాధనకు రూ.5వేలు విరాళం

కార్తీక మాసం సందర్భంగా మండలంలోని ఎ.కోడూరులో లెక్కల వారి కుటుంబం బంగారమ్మ అమ్మవారి గుడి వద్ద ఏర్పాటు చేసిన అన్న సంతర్పణ కార్యక్రమంలో టిడిపి మాడుగుల నియోజకవర్గ నాయకులు పైలా ప్రసాదరావు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. అన్నసంతర్పణ కార్యక్రమానికి రూ.5 వేలు విరాళంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బొడ్డు అక్కునాయుడు, మాజీ సర్పంచ్ లెక్కల మల్లేశ్వరరావు, రాయవరపు మల్లేష్, లెక్కల జగ్గునాయుడు, లెక్కల కన్నం నాయుడు, లెక్కల సురేష్, లెక్కల ఎరుకునాయుడు తదితరులు పాల్గొన్నారు.

మూలపేటలో పశువైద్య శిబిరం

ప్రజాశక్తి -మునగపాక రూరల్ : మండలంలోని మూలపేట గ్రామంలో మండల పశువైద్యాధికారి డాక్టర్ ప్రదీప్ ఆధ్వర్యంలో గురువారం పశువైద్య శిబిరం నిర్వహించారు. పశువుల ఆరోగ్యం, పాల ఉత్పత్తి పెంపునకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. పాడి రైతులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ భీశెట్టి గంగ అప్పలనాయుడు మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డేడ చెల్లయ్య నాయుడు, రైతు సంఘం అధ్యక్షులు శరగడం నాగేశ్వరరావు, రైతులు పాల్గొన్నారు.

ఫలసాయం మొక్కల పంపిణీ

ప్రజాశక్తి-అచ్యుతాపురం : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జీవవైవిధ్య మండలి ఆధ్వర్యంలో మండలంలోని వెదురువాడ గ్రామంలో బొప్పాయి, సీతాఫలం, జామ, వేప తదితర రకాలకు చెందిన 2000 మొక్కలను సర్పంచ్ కొయ్యా శ్రీనివాస్ చేతుల మీదుగా గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ మొక్కలు ద్వారా అటు పర్యావరణానికి, ఇటు ఫలసాయానికి ఉపయోగం ఉంటుందని చెప్పారు. గ్రామ సచివాలయ కార్యదర్శి రజని తదితరులు పాల్గొన్నారు.



మొక్కలు పంపిణీ చేస్తున్న సర్పంచ్ శ్రీనివాస్



పాడి రైతులకు మందులు పంపిణీ చేస్తున్న డాక్టర్ ప్రదీప్

సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట

ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు

ప్రజాశక్తి-చీడికాడ: ప్రజల సంక్షేమంకు వైసిపి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి బూడి ముత్యాలనాయుడు తెలిపారు. మండలంలోని కోనాం సచివాలయం పరిధి వాకపల్లి, గుడివాడ, గుంటి, కొత్తూరు పనసగడ్డ గ్రామల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా బూడి మాట్లాడుతూ, ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు నేరుగా ప్రజలకు అందుతున్నాయన్నారు. పథకాలను వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి కురచా జయమ్మ నారాయణమూర్తి, జెడ్పిటిసి అలం శారద వరలక్ష్మి జానకిరామ్, వైస్ ఎంపిపి ధర్మశెట్టి స్వాతి కొండబాబు, కిమిడి చిన్నమ్మలు కన్వీనర్ రాజబాబు, యువజన అధ్యక్షుడు స్వామినాయుడు, పంచాయతీ కార్యదర్శి సన్యాసిరావు, నాయకులు ఎర్ర అప్పారావు, పాటూరు రమణ రెడ్డి, దేముడు నాయుడు, అధికారులు, సచివాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ప్రజలతో మాట్లాడుతున్న బూడి

రాయితీపై విత్తనాలు

ప్రజాశక్తి-మాడుగుల: రబీ సీజను ప్రారంభం కానున్న దృష్ట్యా వివిధ విత్తనాలు పంపిణీ చేయనున్నట్లు మండల వ్యవసాయ అధికారి వాసుదేవరావు తెలిపారు. ఎంటియు 1121, నెల్లూరు సన్నాలు, ఆర్‌జిఎల్ వంటి రకాలు రాయితీపై సరఫరా చేస్తామని, వీటితో పాటు మినుములు, పెసర, వేరుసెనగ, నువ్వు విత్తనాలు సైతం అన్ని రైతు భరోసా కేంద్రాలలో సిద్ధంగా ఉంచుతామని, రైతులు ముందుగా ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని తెలిపారు.



భోజనాలు వడ్డిస్తున్న నిర్వాహకులు

భారీ అన్న సమారాధన

ప్రజాశక్తి-కోటవురట్ల:మండల కేంద్రంలో మోద కొండమ్మ అమ్మవారి ఆలయం వద్ద గురువారం అన్నసమారాధన నిర్వహించారు. వివిధ గ్రామాలకు చెందిన గ్రామస్తులు పెద్ద సంఖ్యలో హాజరై అమ్మవారి తీర్థప్రసాదాలు స్వీకరించారు. సుమారు 3వేల మంది వరకు పాల్గొన్నట్లు నిర్వాహకులు తెలిపారు.



స్వాధీనం చేసుకున్న పోలీసులు

సారా స్థావరంపై దాడి

ప్రజాశక్తి-రావికమతం: పోలీస్ స్టేషన్ పరిధిలో పిల్లవానిపాలెం గ్రామ శివారులో నాటు సారా స్థావరంపై దాడి నిర్వహించినట్లు స్థానిక ఎస్సై ఉమామహేశ్వరరావు తెలిపారు. ముందస్తు సమాచారం మేరకు తమ సిబ్బందితో కలిసి గురువారం దాడి చేయగా బెల్లం పులుపు ఉన్నట్లు గుర్తించామన్నారు. సంఘటనా స్థలంలో తయారీకి సిద్ధం చేస్తున్న బెల్లం పులుపును ధ్వంసం చేశామన్నారు.

కొనసాగిన మత్స్యకారుల ధర్నా

ప్రజాశక్తి-నక్కపల్లి: హెటిరో పైప్‌లైన్ పూర్తిగా తొలగించాలని మత్స్యకార నాయకులు డిమాండ్ చేశారు. పైప్ లైన్‌కు వ్యతిరేకంగా మత్స్యకార జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన శాంతియుత మహా ధర్నా గురువారం నాటికి 353వ రోజుకు చేరింది. శిబిరం వద్ద మత్స్యకారులు పైప్‌లైన్‌కు వ్యతిరేకంగా పెద్దపెట్టున నినాదాలు చేశారు. పైప్ లైన్‌కు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతులు ఇవ్వకూడదని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ మత్స్యకార జెఎసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వాసిపల్లి నూకరాజు, మత్స్యకార నాయకులు మైలపల్లి జాన్, పిక్కి గంగరాజు, మైలపల్లి బాబ్జి, మైలపల్లి శివాజీ, దైలపల్లి కాశీ, చొడిపిల్లి రాజు, మైలపల్లి అప్పలరాజు, రాజు పాల్గొన్నారు .



నినాదాలు చేస్తున్న మత్స్యకారులు

అటవీ భూమి ఆక్రమణకు యత్నం

ప్రజాశక్తి-నక్కపల్లి:చినతీనార్ల గ్రామంలో వన సంరక్షణకు చెందిన భూములో అక్రమంగా ఎటువంటి అనుమతులు లేకుండా జీడీ చెట్లను, చెట్టు కొమ్మలను నరికి అటవీ సంపద దోచుకొని, భూమిని ఆక్రమించుకోవడానికి ప్రయత్నాలు చేస్తున్నారని శ్రీ నూకమాత గంగాదేవి వన సంరక్షణ సమితి అధ్యక్షులు కంబాల కొర్లయ్య తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, ఎలమంచిలి అటవీ శాఖ కార్యాలయం గుమస్తా గోవిందుతో కలిసి నరికి వేసిన చెట్లను పరిశీలించడం జరిగిందని తెలిపారు. ఇక్కడ పని చేస్తున్న కూలీలను చెట్లను ఎవరు నరకమన్నారని ప్రశ్నించగా కొర్రప్రోలు గ్రామానికి చెందిన వ్యక్తి చెట్లు నరకమని చెప్పారని కూలీలు బదులిచ్చారన్నారు. సంబంధిత అధికారులు తక్షణం స్పందించి చెట్లు నరికించిన వ్యక్తిపై చర్యలు తీసుకుని, భూమి ఆక్రమణకు గురికాకుండా చూడాలని కొర్లయ్య కోరారు.



నరికిన చెట్లు పరిశీలిస్తున్న అధ్యక్షులు

వెంకటాపురంలో 'ఫ్యామిలీ ఫిజిషియన్'

ప్రజాశక్తి- మునగపాక రూరల్ : ఫ్యామిలీ ఫిజిషియన్ సేవలు ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ సుందరపు నీలకంఠ స్వామి కోరారు. మండలంలోని వెంకటాపురం గ్రామంలో గురువారం ఇంటింటికి ఫ్యామిలీ ఫిజిషియన్ సేవలను ఆయన ప్రారంభించారు. రోగులకు మందులను పంపిణీ చేశారు ఈ కార్యక్రమంలో వైద్యాధికారి అనిల్ కుమార్, ఆరోగ్య పర్యవేక్షకులు ఉమా మహేష్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాల్లో 'గడపగడపకు మన ప్రభుత్వం'

ప్రజాశక్తి- మునగపాక రూరల్ : మండలంలోని ఉమ్మలాడ, మల్లవరం గ్రామాలలో ఎలమంచిలి నియోజకవర్గ ఎమ్మెల్యే యువి రమణ మూర్తి రాజు గురువారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో చేపట్టారు. మల్లవరం పంచాయతీ పరిధిలోని గ్రామాలకు రూ.40 లక్షలు నిధులు మంజూరు చేసిన ఇంటింటి కుళాయిల పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డిసిసిబి మాజీ చైర్మన్ యు.సుకుమార్ వర్మ, జడ్పిటిసి స్వామి సత్యనారాయణ, ఎంపిపి మళ్ల జయలక్ష్మి, వైసిపి మండల కన్వీనర్ ఆడారి గణపతి అచ్చం నాయుడు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి - చోడవరం : చోడవరం విద్యుత్ సబ్ స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా శుక్రవారం ఉదయం 8 నుండి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏడి యుకె.గౌరీ శంకర్, ఏడి శ్రీనివాసరాజు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. చోడవరం, గాంధీ గ్రామం, నరసయ్య పేట లక్ష్మీపురం, కండిపల్లి, దామనాపల్లి గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని, వినియోగ దారులు సహకరిం చాలని ఆయన కోరారు.

వరిలో సుడిదోమ నివారణకు చర్యలు

ప్రజాశక్తి-అనకాపల్లి : వరిలో ఉధృతంగా సుడిదోమ ఉన్న కారణంగా పంట నష్టం లేకుండా నివారణ చర్యలు తీసుకోవాలని మండల వ్యవసాయ అధికారి పి.రంగాచారి అన్నారు. మండలంలోని చింత నిప్పుల అగ్రహారం గ్రామంలో రైతు భరోసా కేంద్రం పరిధిలోని రైతులకు గురువారం పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. వరిలో వచ్చే చీడపీడలపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి సభ్యుడు నాగేశ్వరరావు, గ్రామ వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతపై అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి- కశింకోట : మండలంలోని సుందర్యపేట పంచాయతీ శివారు ఆనందపురం గ్రామంలో రోడ్డు, ప్రయాణికుల భద్రతపై గురువారం అవగాహన ర్యాలీ, మానవ హారం చేపట్టారు. అతి వేగం ప్రమాదానికి మూలం, హెల్మెట్ మాకు, మీరు కుటుంబానికి రక్షణ, వేగం కన్నా ప్రాణం మిన్న, సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ, మద్యం సేవించి డ్రైవింగ్ చేయొద్దు అంటూ ద్వాక్రా మహిళలు పెద్దపెట్టున నినాదాలు చేశారు. ఈ కార్యక్రమం ఏపిఎం ఎమ్.శ్రీనివాసరావు, మండల మహిళ సమాఖ్య అధ్యక్షులు కె.అరుణ, అమ్మాజీ, పాల్గొన్నారు.

రోగులకు వైద్య పరీక్షలు



పరీక్షలు చేస్తున్న వైద్యులు

ప్రజాశక్తి-పాయకరావుపేట:మండలంలోని సాల్మాంపేట గ్రామ సచివాలయం వద్ద ఫ్యామిలీ కాన్సెప్ట్‌ను గ్రామ సర్పంచ్ కొడా కోటేశ్వరరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా మెడికల్ ఆఫీసర్ కావ్య , 104 మెడికల్ ఆఫీసర్ బత్తుల రత్నశేఖర్ గురువారం రోగులను పరీక్షించి, రక్త పరీక్షలు నిర్వహించారు. దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తుల ఇళ్లకు వెళ్లి వారికి సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపిహెచ్ఈఓ అర్.జె.బాలాజీ సింగ్, మలేరియా ఇంఛార్జి నోడల్ అధికారి పి.ఎన్.వి.ఎస్ ప్రసాద్, హెల్త్ సూపర్ వైజర్ డి.సూర్యనారాయణ, సచివాలయం హెల్త్ సెక్రటరీ ఎమ్.దివ్య జ్యోతి, పంచాయతీ సెక్రటరీ జి.శివాజీ పాల్గొన్నారు

గొలుగొండ:ప్రజలకు వైద్యం చేరువ చేసేందుకు ఫ్యామిలీ మెడికల్ క్యాంపు ఏర్పాటు చేయడం జరిగిందని సిహెచ్.నాగాపురం సర్పంచ్ యలమంచిలి రామచంద్రరావు అన్నారు. సిహెచ్.నాగాపురం గ్రామంలో గురువారం మెడికల్ క్యాంప్‌ను నిర్వహించారు. డాక్టర్ ఎన్.హరిప్రవీణ్ వైద్య సేవలు అందించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, ప్రభుత్వం ప్రజలకి వైద్యం అందు బాటులో తీసుకొస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.



పనులు పరిశీలిస్తున్న ఎంపిటిసి , ఎంఈఓ

'నాడు - నేడు' పనుల పరిశీలన

ప్రజాశక్తి-నక్కపల్లి:మండలంలోని వేంపాడు కొత్తూరు లో మండల పరిషత్ పాఠశాల భవన నిర్మాణ పనులను గురువారం వేంపాడు ఎంపిటిసి సభ్యులు కుంచె మధు, మండల విద్యాశాఖాధికారి డి.వి.డి.ప్రసాద్, ఇంజినీర్ జెజెవి ప్రసాద్‌లు పరిశీలించారు. నాడు నేడు కింద రూ.42 లక్షల నిధులు మంజూరైనట్లు తెలిపారు. నాణ్యతగా భవన నిర్మాణ పనులను చేపట్టాలని, సకాలంలో నిర్మాణం పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు అనుకుల కామేశ్వరి, ఐనపర్తి మహేశ్వరరావు, తూము దుర్గమ్మ, నాయకులు పల్లా రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

నేడు మండల స్థాయి ప్రతిభా పరీక్ష

ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్:జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యాన రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న చెకుముకి సైన్స్ సంబరాల్లో భాగంగా ఇప్పటికే పాఠశాల స్థాయి ప్రతిభా పాఠవ పరీక్ష ముగిసింది. వీటిలో గెలుపొందిన వారికి అన్ని మండలాల్లో ఈనెల 18న మండల స్థాయి పరీక్ష జరగనుందని జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకులు కె. త్రిమూర్తులురెడ్డి తెలిపారు. నర్సీపట్నం అర్బన్ మండలాని చెందిన విద్యార్థులకు ఐదు రోడ్ల జంక్షన్‌లో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోను, నర్సీపట్నం రూరల్ మండలానికి చెందిన విద్యార్థులకు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వేములపూడిలోను, కోటవురట్ల మండలానికి చెందిన విద్యార్థులకు కోటవుట్ల శాఖ గ్రంథాలయం, గొలుగొండ మండలానికి చెందిన వారికి జోగంపేట జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలోను, నాతవరానికి చెందిన విద్యార్థులకు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, రోలుగుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి చెకుముకి టాలెంట్ టెస్ట్ నిర్వహిస్తున్నామని తెలిపారు.

20న నర్సీపట్నంలో మెగా రక్తదాన శిబిరం

- జెడ్‌పిటిసి గిరిబాబు

ప్రజాశక్తి-గొలుగొండ: ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్‌గణేష్ జన్మదినం సందర్భంగా ఈనెల 20న నర్సీపట్నంలో మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించనున్నామని గొలుగొండ మండల జడ్పిటిసి సుర్ల గిరిబాబు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతి గ్రామం నుంచి ముగ్గురు రక్తదానానికి ముందుకు వచ్చే విధంగా గ్రామ స్థాయి నాయకులు బాధ్యతలు తీసుకోవాలని ఆయన సూచించారు. మెగా రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయడానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజా ప్రతినిధులు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.





మాట్లాడుతున్న సర్పంచ్ సుజాత

అసత్య ఆరోపణలు తగవు

ఎఎల్ పురం సర్పంచ్ లోచల సుజాత

ప్రజాశక్తి-గొలుగొండ:మాజీ జెడ్పిటిసి చిటికెల వేణుగోపాల్ అసత్య ఆరోపణలు చేయడం సరికాదని ఏఎల్‌పురం సర్పంచ్ లోచల సుజాత అన్నారు. గురువారం ఆమె స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, ఇప్పటికే ఏఎల్‌పురంలో అర్హత గల వారికి 171 మందికి స్థలాలు ఇచ్చామని, అర్హత లేకుండా ఎవరికి స్థలాలు కేటాయించలేదన్నారు. ఎవరికైనా అనర్హులకు స్థలాలు ఇచ్చినట్లు తెలియజేస్తే వెంటనే పరిశీలిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసిలు చింతల బుల్లిప్రసాద్, మామిడి కృష్ణ, మండల వైసిపి ప్రధాన కార్యదర్శి చిటికెల ప్రకాష్ పాల్గొన్నారు.

జగనన్న కాలనీలపై అసత్య ప్రచారం

ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ

ప్రజాశక్తి- కొత్తకోట:రాష్ట్రంలో 30 లక్షల మంది నిరుపేదలకు నివాస గృహాలు కల్పిస్తే తెలుగుదేశం, జనసేన నాయకులు ఓర్వలేక తప్పుడు ప్రచారం చేస్తున్నారని ప్రభుత్వ విప్, చోడవరం ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ విమర్శించారు. రావికమతం మండలం కొత్తకోటలో స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, గతంలో ఏ ప్రభుత్వం చేపట్టలేని జగనన్న కాలనీ పథకాన్ని తెలుగుదేశం, జనసేన పార్టీలు రాజకీయ లబ్ది కోసం నీరు కార్చేందుకు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నాయన్నారు. ప్రతి పేదవానికి కూడు, గూడు, విద్య, వైద్యం, ఉపాధి అందించాలన్న సంకల్పంతో సీఎం జగన్ కృషి చేస్తున్నారని ధర్మశ్రీ చెప్పారు. తెలుగుదేశం పార్టీ పేదలకు నివాస స్థలాలు పంపిణీ చేయొద్దు అంటూ కోర్టులను ఆశ్రయించిందని ఇప్పుడు జనసేన పార్టీ సైనికులు జగనన్న కాలనీలో అవినీతి జరుగుతుందంటూ కాలనీ నిర్మాణాలను అడ్డుకుంటున్నారని విమర్శించారు. అవినీతి జరిగిన చోట నిరూపిస్తే ప్రభుత్వం వారిపై చర్యలు తీసుకుంటుందని ధర్మశ్రీ పేర్కొన్నారు. లబ్ధిదారులు ఇష్ట ప్రకారమే కాలనీల నిర్మాణాలు చేపడుతున్నామని అందులో అవినీతికి తావు లేదని స్పష్టం చేశారు. ఇల్లు నిర్మాణంలో నాణ్యత లోపం, అవినీతి జరిగితే కఠిన చర్యలు తీసుకుంటామని సీఎం జగన్ స్పష్టం చేశారని, పారదర్శకంగా పథకాలు అమలు చేయడమే ప్రభుత్వ లక్ష్యం అని తెలిపారు. జగనన్న కాలనీ నిర్మాణాల జాప్యానికి కారణాలు కరోనా, వర్షాలు, కొంత కాగా టిడిపి కోర్టుల ద్వారా పెట్టిన అడ్డంకులు వల్లే కాలనీ ఇల్లు నిర్మాణాలు జరగలేదని ధర్మశ్రీ చెప్పారు. కొత్తకోటలో తాగునీటి అవసరాలకు సుమారు రూ.20 కోట్ల నిధులతో ప్రణాళిక రూపొందిస్తున్నామని, బుచ్చయ్యపేట మండలంలో ఎస్ఈజెడ్ ఏర్పాటు చేసి నిరుద్యోగ సమస్యను నివారిస్తామని వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కోన లోవరాజు, ఉప సర్పంచ్ పందల దేవ, వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి తలారి ఆదిమూర్తి, ఎంపిటిసిలు పూడి దేవ, కుంచా లక్ష్మీ, పైల చిన్నమ్మలు, శీలం శంకర్రావు, గుమ్మడి దొరబాబు, మాజీ ఉపసర్పంచ్ కె.గున్నాజీ, గాలి రమణబాబు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ధర్మశ్రీ



వ్యాసరచన రాస్తున్న విద్యార్థులు

విద్యార్థులకు చెకుముకి పోటీలు

ప్రజాశక్తి -కోటవురట్ల: జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో గురువారం వెంకటాపురం జిల్లా పరిషత్ పాఠశాలలో విద్యార్థులకు చెకుముకి పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.వి నాగేశ్వరరావు మాట్లాడుతూ, విద్యార్థులకు ఇటువంటి పోటీలు నిర్వహించడంతో వారిలో మేధా సంపత్తు పెరుగుతుందన్నారు. గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

టెక్స్‌టైల్స్ పవర్ లూమ్స్ యూనిట్లు ప్రారంభం

ప్రజాశక్తి- చీడికాడ :మండలంలోని శిరిజం గ్రామ శివార ఎల్ఎన్ పురంలో స్వాతి టెక్స్ టైల్స్ పవర్ లూమ్స్, జయశ్రీ టెక్స్ టైల్స్ పవర్ లూమ్స్ యూనిట్ లను డిప్యూటీ సీఎం బూడి ముత్యాల నాయుడు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ సత్యవతి మాట్లాడుతూ, ఈ పరిశ్రమలు ప్రజలకు ఉపాధి కల్పనకు తోడ్పడుతుందని ఆమె అన్నారు. బూడి ముత్యాలయుడు మాట్లాడుతూ, పారిశ్రామికంగా చిన్న తరహా పరిశ్రమల ఏర్పాటుకు మాడుగుల నియోజక వర్గంలోని ప్రతి ప్రాంతానికి సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెస్ ఎం ఇ ప్రతినిధి నదియ, ఎంపీపీ జయమ్మ నారాయణమూర్తి, జడ్పిటిసి శారద వరలక్ష్మి జానకిరామ్, తహసిల్దార్ బివి రాణి పాల్గొన్నారు.

హర్షిణి ఔదార్యం

జన్మదినం సందర్భంగా భోజనం, రగ్గుల పంపిణీ

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్:తండ్రికి తగిన తనయ అనిపించుకుంటుంది అల్లూరి యువ గిరిజన సేవా సంఘం అధ్యక్షులు టి.మల్లేష్ తనయురాలు హర్షిణి. గురువారం హర్షిణి తన 8వ పుట్టిన రోజు సందర్భంగా తాను డిబ్బీలో దాచుకున్న నగదుతో నర్సీపట్నం మున్సిపాలిటీ లోని పెదబొడ్డేపల్లి నిరాశ్రయుల వసతి గృహం లోని 21 మంది నిరాశ్రయులకు భోజనం అందించడంతో పాటు రగ్గులు పంపిణీ చేసింది. హర్షిణి సేవా దృక్పథంతో పంపిణీ చేయడంపై పలువురు ఆనందం వ్యక్తం చేశారు. హర్షిణీకి నర్సీపట్నం అమ్మా హాస్పటల్ డాక్టర్ రాజు, ఉమానారాయణ ఆసుపత్రి వైద్యులు మల్లికార్జునరావుతో పాటు పలువురు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలియజేశారు.



వితరణ ఇస్తున్న బాలిక



ఎమ్మెల్యేను కలిసిన విద్యార్థులు

క్రీడలకు ప్రభుత్వ ప్రోత్సాహం

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్:జగనన్న క్రీడా సంబరాల్లో నియోజకవర్గ స్థాయి నుండి జిల్లా పోటీలకు ఎంపికైన కబడ్డీ క్రీడాకారులు నర్సీపట్నం ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ క్రీడాకారులు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చదువుతున్నారు. ఈ విద్యార్థినులకు టీ షర్ట్స్ నిమిత్తం ఎమ్మెల్యే నగదు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం క్రీడాకారులకు క్యాష్ అవార్డులు, రివార్డులు, ఉద్యోగాలిచ్చి ప్రోత్సహిస్తుందని, దీన్ని ఉపయోగించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పిడి సురేష్బాబు, సీనియర్ క్రీడాకారిణిలు పాల్గొన్నారు.

మహిళ ఇంటిని కూల్చడం దారుణం

మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు

ప్రజాశక్తి -నర్సీపట్నం రూరల్: లైంగిక వాంఛ తీర్చ లేదనే కోపంతో గొలుగొండ మండలం కొత్తఎల్లవరం గ్రామానికి చెందిన పావాడ వెంకటలక్ష్మికి చెందిన ఇంటిని వైసిపి నాయకులు అధికారుల సమక్షంలో కూల్చివేయడం దారుణమని మాజీ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు అన్నారు. గురువారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, ఈ విషయమై ఫిర్యాదు చేయడానికి పోలీస్స్టేషన్‌కు వెళితే కనీసం పోలీసులు సహకారం లేదన్నారు. సోమవారం లోపు మహిళకు న్యాయం చేయాలని, లేదంటే దీనికి సంబంధించిన అధికారులపై కోర్టులో కేసు వేస్తామన్నారు.



సందడిగా గిరిజన సంబరాలు

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ : భారత గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ, ఆంధ్రప్రదేశ్ గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యాన బీచ్ రోడ్డులో తలపెట్టిన గిరిజన గౌరవ దినోత్సవ సంబరాలు మూడో రోజైన గురువారమూ ఉత్సాహంగా సాగాయి. సీతంపేట, పార్వతీపురం, పాడేరు, చింతూరు, కెఆర్.పురం, నెల్లూరు, శ్రీశైలం ప్రాంతాల్లోని గిరిజన కళాకారులు నృత్య రూపాలను ప్రదర్శించారు. వారికి అతిథులు ప్రశంసా పత్రాలను అందజేశారు. గిరిజన కళాకారులు తయారుచేసిన వస్తువులు స్టాల్స్‌లో కొలువుదీరి అందరినీ ఆకట్టుకున్నాయి. మూడో రోజు కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా గిరిజన సాంస్కృతిక పరిశోధన, శిక్షణ మిషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జి.చిన్నబాబు, ఆంధ్ర యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ కె.సత్యపాల్, డాక్టర్ రమేష్, గీతం విశ్వవిద్యాలయం ఇంగ్లీష్ ప్రొఫెసర్ డాక్టర్ సి.ప్రగ్యా, తదితరులు పాల్గొన్నారు.



గిరిజన కళాకారులతో అతిథులు

అయ్యన్నవి నీచ రాజకీయాలు

ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్

ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్:మాజీ మంత్రి అయ్యన్న పాత్రుడు దౌర్భాగ్య, నీచ రాజకీయాలు చేస్తున్నాడని ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్ మీడియాకు పంపిన వీడియోలో విమర్శించారు. గొలుగొండ మండలం యల్లవరం గ్రామానికి చెందిన ఒంటరి మహిళపై వైసీపీ నేతలు లైంగిక వేధింపులు చేస్తున్నారని తప్పుడు ఆరోపణలు చేస్తున్న అయ్యన్నపాత్రుడు ఈ మూడు సంవత్సరాలలో శవ, కుల రాజకీయాలు చేశాడని విమర్శించారు. ఇప్పుడు ఒంటరి మహిళ పేరుతో కొత్త రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. ఆమె ఒంటరి మహిళ కాదని ఆమెకు భర్త ఉన్నాడని ఆయన విశాఖలో ఉన్నాడని, అతడి పేరుతో రేషన్ కూడా తీసుకుంటు న్నారని తెలిపారు. ఏమీ తెలియకుండా విమర్శించడం తగదన్నారు. ఆమె ఇరిగేషన్‌కు సంబంధించి స్థలాన్ని ఆక్రమించడంతో నిర్మాణాలు నిలిపివేయడం జరిగిందని, దీన్ని అయ్యన్నపాత్రుడు రాజకీయం చేస్తున్నారని తెలిపారు. ఇప్పటికే అయ్యన్నపాత్రుడు రెండు సెట్ల ఇరిగేషన్ స్థలం కబ్జా చేసిన సంగతి తెలిసిందేనని, ఈ నేపథ్యంలోనే అయ్యన్నపాత్రుడు ఎన్నో ఇబ్బందులు పడుతున్నాడని, అదే విధంగా ఆమె కూడా శిక్ష అనుభవించి ఇబ్బందులు పడేలా ప్రేరేపిస్తున్నారని దుయ్యబట్టారు. పంచాయతీ, రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు అక్రమ నిర్మాణాలను తొలగించారని, ఇప్పటికే ఆ మహిళ పేరున ఇంటి స్థలం, ఇల్లు ఇవ్వడం జరిగిందని, ప్రభుత్వం పై బురదజల్లేందుకు అయ్యన్న ఒక మహిళను అడ్డం పెట్టుకొని వాడుకుంటున్నాడని, ఆమె ఇబ్బందులు పడే విధంగా చేస్తున్నాడన్నారు. ప్రభుత్వ స్థలాలలో ఇల్లు నిర్మించకూడదని అయ్యన్నకు తెలియదా అని ప్రశ్నించారు. నాతవరం మండలంలో ఇరిగేషన్ స్థలంలో అమ్మవారి గుడి కడితేనే అయ్యన్న కోర్టుకి వెళ్లి స్టే తెచ్చుకున్నారన్నారు. ఆమెకు పాక నిర్మాణం సోమవారం నాటికి చేయకుంటే అధికారులపై కేసు వేస్తానని అయ్యన్న బెదిరిస్తున్నాడని, కోర్టుకి వెళ్తే ఆయనకు బుద్ధి వస్తుందన్నారు.



రైతులకు తీవ్ర అన్యాయం

ప్రజాశక్తి-నర్సీపట్నంరూరల్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు అన్యాయం చేస్తున్నాయని రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెవివి ప్రసాద్ విమర్శించారు. గురువారం నర్సీపట్నం ఒక ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో రైతు సంఘం ముఖ్య కార్యకర్తల సమావేశం రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు నూకినాయుడు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలు అమలు చేయకుండా తీవ్ర అన్యాయం చేస్తున్నాయన్నారు. వ్యవసాయరంగం నష్టాల ఊబిలో కొట్టుమిట్టాడుతుందన్నారు. ప్రభుత్వాలు రైతుల సబ్సిడీపై కూడా కోత పెడుతున్నాయని, రుణాలు ఇవ్వలేదన్నారు.

సిపిఐ అనకాపల్లి జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకటరమణ మాట్లాడుతూ, జిల్లాలో మూతపడిన షుగర్ ఫ్యాక్టరీలను తెరిపించేలా పోరాటం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు రావు జగ్గారావు, రాష్ట్ర సహాయ కార్యదర్శి పి.గంగాభవాని, అనకాపల్లి జిల్లా రైతు సంఘం కార్యదర్శి మేకా సత్యనారాయణ, సిపిఐ అనకాపల్లి జిల్లా సహాయ కార్యదర్శి రాము నాయుడు, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు జి. గురుబాబు, వ్యవసాయ కార్మిక సంఘం అనకాపల్లి జిల్లా అధ్యక్షులు ఎస్.కొండలరావు, ఉపాధ్యక్షులు వెలుగుల అర్జునరావు పాల్గొన్నారు.



హాజరైన నాయకులు

ప్రేమోన్మాదిపై కఠిన చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : మత్స్యకార యువతి శ్రద్ధా వాకర్‌ను ప్రేమ పేరుతో వంచించి, హత్య చేసి, శరీరాన్ని 35 ముక్కలుగా కోసి, ఢిల్లీలోని పలు ప్రాంతాల్లో విసిరేసి నేరాన్ని కప్పిపుచ్చుకోవడానికి ప్రయత్నించిన ప్రేమోన్మాది అఫ్తాబ్ పూనావాలాను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ గురువారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద జన జాగరణ సమితి ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. సమితి రాష్ట్ర కార్యదర్శి కె.వాసు, జనసేన ఉత్తర నియోజకవర్గం ఇన్‌ఛార్జి పసుపులేటి ఉషాకిరణ్ మాట్లాడారు.

స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ ఆపాలి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను ప్రయివేటీకరణ చేయొద్దని సుదీర్ఘ కాలంగా ఉద్యమాలు సాగుతున్నా ప్రధాని మోడీ పట్టించుకోకపోవడం దారుణమని సిఐటియు గోపాలపట్నం జోన్ కార్యదర్శి బి.వెంకటరావు అన్నారు. వైజాగ్ స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రయివేటీకరణను నిరసిస్తూ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి ఆధ్వర్యాన చేపట్టిన రిలే దీక్షలు గురువారానికి 595వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల విశాఖపట్నం వచ్చిన మోడీ స్టీల్‌ప్లాంట్‌పై ఎటువంటి ప్రకటనా చేయకుండా జారుకోవడం దుర్మార్గమన్నారు. స్టీల్‌ప్లాంట్‌ను రక్షించుకోవడానికి ఎంతటి పోరాటానికైనా సిద్ధమన్నారు. కర్మాగారానికి సొంత గనులు కేటాయించాలన్నారు. దీక్షల్లో పి.సత్యనారాయణ, పృధ్వీ, నితిన్, చిన్నారావ్ తదితరులు పాల్గొన్నారు.

23న రాష్ట్ర స్థాయి స్టాంపుల ప్రదర్శన ప్రారంభం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖపట్నం పోస్టల్ రీజియన్ పరిధి రైల్వే న్యూ కాలనీ పార్వతీ కల్యాణ మండపంలో రాష్ట్ర స్థాయి స్టాంపుల ప్రదర్శనను ఈ నెల 23 నుంచి 25 వరకూ నిర్వహించనున్నట్టు పోస్టల్ అధికారులు తెలిపారు. ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా ఎయు విసి ప్రసాద్‌రెడ్డి, ముగింపు వేడుకకు గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్ హాజరవుతారని పేర్కొన్నారు.

20 నుంచి ప్రపంచ మత్స్యకార వేడుకలు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : ప్రపంచ మత్స్యకారుల దినోత్సవాన్ని ఈ నెల 20, 21 తేదీలలో తమ సంఘం ఆధ్వర్యంలో ఆర్‌కె.బీచ్‌లో నిర్వహిస్తున్నామని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మత్స్యకారుల అభివృద్ధి సంక్షేమ సేవా సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు అల్లిపల్లి ఎల్లాజీ తెలిపారు. గురువారం విజెఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ 20న ఉదయం 10 గంటలకు బీచ్ సీ పెరల్ వేదిక వద్ద 'ఆంధ్రా కవాలి' పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. 21న సాయంత్రం 5 గంటలకు దక్షిణ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్, భీమిలి ఎమ్మెల్యే, మాజీ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు సారథ్యంలో మత్స్యకారుల కుటుంబాలకు చీరలు, దుప్పట్ల పంపిణీ కార్యక్రమం ఉంటుందన్నారు. 8 వేల మందికి మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. కేరళ, ఒడిశా వంటి రాష్ట్రాల్లో వలే స్థానిక మత్స్యకారులను ఎస్‌టి జాబితాలో చేర్చాలని కోరారు. మత్స్యకార కుటుంబంలో ప్రమాదవశాత్తు ఎవరైనా మరణిస్తే రూ.10 లక్షలు ఎక్స్‌గ్రేషియో చెల్లించాలన్నారు. మీడియా సమావేశంలో సురపతి అప్పలరాజు, సురపతి అప్పన్న, ఉమ్మిడి అప్పలరాజు పాల్గొన్నారు.